నీలగిరి ఎక్స్‌ప్రెస్
RNI - TELTEL/2023/87644
తెలుగు దినపత్రిక

సంచిక: 06 | సంపుటి:3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 3-7-2026 | పేజీలు: 8 | వెల: రూ.5.00


## నీలగిరి నిత్యపద్యం
### ఆటవెలది

జ్ఞాపకాలు వదిలి జాగ్రత్తగా నీవు
అడుగువేయ శుభము నవనియందు
గతము విడువకుండ గమనంబు జేసిన
ముందుకేగలేవు ముప్పుసుమ్ము

మీ విజయప్రసాద్
నలుమాసు తెలుగు బోధకులు,కవి


విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్) & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్‌లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు మండల రిపోర్టర్‌లు
- క్రైమ్ రిపోర్టర్‌లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్‌లు కావలెను.
వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909.


# జీ రామ్ జీపై సుప్రీంకు..



- ఈ చట్టం సమాఖ్య విధానానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని నిరసన
- బడులు, జూనియర్ కాలేజీల బోధనా సిబ్బందికీ అల్పాహారం, పాలు, లంచ్
- రాష్ట్రంలో లక్షన్నర మంది గురువులకు భోజన సదుపాయం
- నాలుగు టిమ్స్ ఆస్పత్రులకు 6,278 పోస్టులు మంజూరు
- కర్మాలపహాడ్, బొల్లికుంటలో భారీ గోదాముల నిర్మాణం
- నవోదయ పాఠశాలలకు స్థలాలు
- మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పొంగులేటి

2లో



2లో


## వాళ్ల డ్రామా చూస్తుంటే బిగ్ బాస్ షో చూస్తున్నట్టుంది

- గన్ పార్క్ వద్ద బహిరంగ చర్చకు కాంగ్రెస్ మంత్రుల పిలుపు
- బయలుదేరిన బీఆర్ఎస్ నేతలను మార్గమధ్యంలో అడ్డుకున్న పోలీసులు
- ఇదంతా బిగ్ బాస్ షో అంటూ బీజేపీ నేత బండి సంజయ్ విమర్శ

తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గురుకుల టెండర్లలో అవకతవకలు, రాష్ట్ర అప్పుల అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య చోటుచేసుకున్న సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. బహిరంగ చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ విసిరిన సవాల్‌ను స్వీకరించి గన్ పార్క్ వైపు బయలుదేరిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో హైడ్రామా నెలకొంది.

## నేను చదివిన ఆర్థికశాస్త్రం కంటే సమాజమే ఎక్కువ నేర్పింది

- ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ కెపాసిటీ బిల్డింగ్‌పై తిరుపతిలో వర్క్‌షాప్
- ప్రజల జీవితాల్లో మార్పే అభివృద్ధికి అసలైన కొలమానం అని చంద్రబాబు స్పష్టీకరణ
- అమరావతిలో త్వరలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటన
- ఏపీ ప్రభుత్వ విధానాలను ప్రశంసించిన కేంద్ర ఆర్థిక సలహాదారులు
- నిరంతరం పనిచేయాలి, సంతృప్తి చెందితే అక్కడే ఆగిపోతామన్న సీఎం



తాను ఆర్థిక శాస్త్రం చదివినప్పటికీ, పుస్తకాల కంటే సమాజం, ప్రజల నుంచే ఎక్కువ నేర్చుకున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆర్థిక వృద్ధి గణాంకాలు పెరగడం మాత్రమే కాకుండా, ఆ వృద్ధి పేదల జీవితాల్లో ఎంత మార్పు తీసుకొస్తోందన్నదే ప్రభుత్వానికి అసలైన కొలమానమని స్పష్టం చేశారు. డేటా ఆధారిత పాలన, సమర్థవంతమైన పరిపాలన ద్వారానే రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దగలమని ఆయన పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న 'ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ కెపాసిటీ బిల్డింగ్' రాష్ట్రస్థాయి

- మిగతా 2వ పేజీలో

## ఏపీకి నేను మేనమామను... మేనమామ ఎప్పుడూ ఉత్త చేతులతో రాడు

- చంద్రబాబు, పవన్‌తో కలిసి వీబీ జీ రామ్ జీ పథకాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి
- రాష్ట్రానికి 74,212 పక్కా ఇళ్లు, రోడ్లకు రూ.422 కోట్లు ప్రకటించిన చౌహాన్
- మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద తోతాపురి మామిడి కొనుగోలుకు అంగీకారం



2లో

## వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై కీలక ప్రకటన..

- రాబోయే యూజర్‌నేమ్ ఫీచర్‌పై నెలకొన్న ఆందోళనలపై వాట్సాప్ వివరణ
- ఈ ఫీచర్ తప్పనిసరి కాదని, పూర్తిగా ఐచ్ఛికమని స్పష్టీకరణ
- మోసాలు, ఫేక్ అకౌంట్లను నిరోధించేందుకు పటిష్ఠమైన భద్రతా చర్యలు
- భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక్కడ ఫీచర్ ప్రారంభం వాయిదా
- ప్రముఖుల పేర్లను ఇతరులు క్లెయిమ్ చేసుకోకుండా ప్రత్యేక ఏర్పాట్లు

## ఏసీబీ వలలో అవినీతి అధికారి.. డీఎస్పీ ఇంట్లో కట్టల కొద్దీ నోట్లు, బంగారం!

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో డీఎస్పీ భీంరెడ్డి అరెస్ట్
- తెలంగాణ, కర్ణాటకలో పలు ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ దాడులు
- విల్లాలు, ప్లాట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, 45 ఎకరాల భూములు గుర్తింపు
- రూ.43 లక్షల నగదు, 2 కిలోల బంగారం, 20 కిలోల వెండి స్వాధీనం



2లో

## క్రాంతి కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం

- ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన జగన్
- పోలీసు వేధింపుల వల్లే క్రాంతి మృతి చెందాడని ఆరోపణ
- సీఎం రక్షణ వల్లే దోషులు తప్పించుకుంటున్నారని జగన్ విమర్శ
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని హామీ

2లో





2లో

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం..
### పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరాయన్న గోయల్
- 99 శాతం చర్చలు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి
- టారిఫ్ ప్రయోజనాలపై చట్టపరమైన అంశమే చివరి అడ్డంకి అని వెల్లడి

## మహారాష్ట్రలో కుండపోత వర్షాలు

- మహారాష్ట్రలో పూర్తిస్థాయిలో 'నైరుతి' ప్రభావం
- ముంబై సహా రాష్ట్రవ్యాప్తంగా కుండపోత వర్షాలు
- మరో ఐదురోజులు కొనసాగుతాయని ఐఎండీ హెచ్చరిక
- ఆరు జిల్లాలకు రెడ్అలర్ట్



2లో



## తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్

- అవినీతి, అప్పులపై అధికార, ప్రతిపక్ష పార్టీల సవాళ్లు
- గన్‌పార్క్, తెలంగాణ భవన్ వేదికగా వేడెక్కిన రాజకీయం
- గన్‌పార్క్ వద్దకు వచ్చిన ముగ్గురు మంత్రులు అడ్లూరి, పొన్నం, అజహర్
- మరోవైపు తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు, కేటీఆర్
- మంత్రి జూపల్లి కోసం అక్కడే వేచి చూసిన కేటీఆర్
- తెలంగాణ భవన్‌కు వెళ్లకుండా గన్‌పార్క్ వద్దకు వచ్చిన జూపల్లి

హైదరాబాద్: అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల సవాళ్లు, ప్రతిసవాళ్లతో గురువారం రాష్ట్ర రాజకీయం వేడెక్కింది. గురుకులాల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలు, బీఆర్ఎస్ హయాంలో అప్పుల విమర్శలు ఇందుకు కారణమయ్యాయి. ఆయా అంశాలపై చర్చకు సిద్ధమన్న ఇరుపక్షాలు ఎలాంటి చర్చలూ జరగకుండానే గన్‌పార్క్, తెలంగాణ భవన్

- మిగతా 2వ పేజీలో

## ఏసీబీ వలలో అవినీతి అధికారి..

## డీఎస్పీ ఇంట్లో కట్టల కొద్దీ నోట్లు, బంగారం!

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తెలంగాణ పోలీస్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సంకిరెడ్డి భీంరెడ్డిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. గురువారం ఉదయం హైదరాబాద్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహించిన సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించారు. ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ పర్యవేక్షణలో సుమారు 20 బృందాలు ఈ దాడులలో పాల్గొన్నాయి. హైదరాబాద్ శివారు నార్సింగిలోని 'వెస్సెల్లా మీడోస్'లో ఉన్న భీంరెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో విల్లాలు, పెంట్‌హౌస్‌లు, ఫ్లాట్లు, వాణిజ్య సముదాయాలు, ఖాళీ ప్లాట్లు మరియు వ్యవసాయ భూములకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోదాల సందర్భంగా రూ. 43.06 లక్షల నగదు, 2 కిలోల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులను ఏసీబీ అధికారులు కనుగొన్నారు. వీటితో పాటు గచ్చిబౌలి, తెల్లాపూర్‌లలో ఫ్లాట్లు, మణికొండలో నిర్మాణంలో ఉన్న వాణిజ్య సముదాయంలో వాటా, సంగారెడ్డి జిల్లాతో పాటు కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 45 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. అలాగే 'శ్రీ రాఘవేంద్ర రాక్ శాండ్ మినరల్స్'లో రూ. 75 లక్షల మేర పెట్టుబడులు పెట్టినట్టలు నిర్ధారించారు.

## ఏపీకి నేను మేనమామను...

## మేనమామ ఎప్పుడూ ఉత్త చేతులతో రాడు

ఆంధ్రప్రదేశ్‌కు తాను మేనమామ లాంటి వాడినని, మేనమామ ఎప్పుడూ ఖాళీ చేతులతో రాడని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. తనను మధ్యప్రదేశ్‌లో ప్రజలంతా ఆప్యాయంగా 'మామాజీ' అని పిలుస్తారని, ఇప్పుడు ఏపీ ప్రజలకు కూడా తాను మేనమామనే అయ్యానని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వరాల జల్లు కురిపిస్తూ, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన కింద 74,212 పక్కా ఇళ్లు, గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.422 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అందజేశారు. తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్' (వీబీ జీ రామ్ జీ)ను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి శివరాజ్ సింగ్ చౌహాన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ఏపీ నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావడం చారిత్రక ఘట్టమని ఆయన అభివర్ణించారు. దేశవ్యాప్తంగా గ్రామాల అభివృద్ధి కోసం ఈ పథకం కింద రూ.7.5 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. రాబోయే 9 నెలల కాలానికి గాను ఈ పథకం కింద ఏపీకి రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ సభలే తమకు అవసరమైన పనులను ఎంపిక చేసుకుని అమలు చేసే అధికారం ఈ పథకం కల్పిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా రైతుల కోసం మరో కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని రైతుల నుంచి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద 2,16,250 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని కేంద్రం కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను కూడా ఆయన ముఖ్యమంత్రికి అందజేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని, ఎట్టిపరిస్థితుల్లోనూ చేయి విడిచిపెట్టే ప్రసక్తే లేదని చౌహాన్ స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజున ఒక మొక్క నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేశ్ పాశ్వాన్, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం..

చైనా, ఆగ్నేయాసియా దేశాల కన్నా భారత్‌కు ప్రాధాన్యత కల్పించడమే లక్ష్యం

భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ దాదాపు 99 శాతం పూర్తయిందని, కేవలం ఒకే ఒక్క కీలక అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఈ ఒప్పందం ద్వారా అమెరికా మార్కెట్‌లో ప్రాంతీయ పోటీదారుల కంటే భారత్‌కు విశేష ప్రాధాన్యత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన 'ఇండో-జపాన్ స్ట్రాటజిక్ డైలాగ్' కార్యక్రమంలో పీయూష్ గోయల్ ప్రసంగించారు. ఈ ఒప్పందం ఇరు దేశాలకూ అత్యంత న్యాయబద్ధంగా, సమతుల్యంగా ఉంటుందని ఆయన అభివర్ణించారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, భారత్‌కు సుంకాల పరంగా లబ్ధి చేకూర్చేందుకు అవసరమైన చట్టబద్ధమైన యంత్రాంగాన్ని రూపొందించడమే ప్రస్తుతం మిగిలి ఉన్న ఆ ఒక శాతం అడ్డంకి అని ఆయన వివరించారు. తయారీ రంగంలో ప్రధాన పోటీదారులైన చైనా, ఆగ్నేయాసియా దేశాల కంటే భారత్‌కు మెరుగైన ప్రాధాన్యత లభించాలని కోరుతున్నామని, దీనిపై అమెరికా సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం చురుగ్గా కృషి చేస్తోందని తెలిపారు.

## వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై కీలక ప్రకటన..

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్, త్వరలో తీసుకురానున్న 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై నెలకొన్న ఆందోళనలపై స్పష్టతనిచ్చింది. ఈ ఫీచర్ పూర్తిగా ఐచ్ఛికమని, వినియోగదారుల భద్రతకు పెద్దపీట వేస్తూ అనేక జాగ్రత్తలు తీసుకున్నామని మెటా యాజమాన్యంలోని వాట్సాప్ వెల్లడించింది. ఈ ఫీచర్ ద్వారా మోసాలు, నకిలీ ఖాతాల బెడద పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవడం, భారత ప్రభుత్వం కూడా దీనిపై వివరణ కోరడంతో వాట్సాప్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు భారత్‌లో ఈ ఫీచర్ ప్రారంభాన్ని వాయిదా వేస్తున్నట్టు తెలిపింది. యూజర్‌నేమ్ ఫీచర్‌పై సోషల్ మీడియాలో వస్తున్న ఆందోళనలు, అనుమానాలను నివృత్తి చేసేందుకు వాట్సాప్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పలు కీలక విషయాలను వెల్లడించింది. వినియోగదారులందరూ తప్పనిసరిగా యూజర్‌నేమ్ క్రియేట్ చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇది కేవలం అదనపు సౌకర్యం మాత్రమేనని, ఫోన్ నంబర్ ద్వారానే వాట్సాప్ వాడకాన్ని కొనసాగించవచ్చని తెలిపింది. ముఖ్యంగా ప్రముఖులు, సెలబ్రిటీలు, ప్రభుత్వ సంస్థలు, అలాగే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఇప్పటికే వెరిఫైడ్ ఖాతాలు ఉన్నవారి యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసినట్లు వాట్సాప్ పేర్కొంది. అంటే.. ఆ పేర్లను కేవలం వారి అసలైన యజమానులు మాత్రమే క్లెయిమ్ చేసుకోగలరు. తద్వారా ఇతరులు వారి పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి మోసాలకు పాల్పడే అవకాశం ఉండదని భరోసా ఇచ్చింది. పాపులర్ పేర్లను ఎవరైనా రిజర్వ్ చేసుకోవచ్చని వస్తున్న వార్తల్లో నిజం లేదని కొట్టిపారేసింది.

# జీ రామ్ జీపై సుప్రీంకు..

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన వీబీ--జీ రామ్ జీ (వికసిత్ భారత్-- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్--(గ్రామీణ్)చట్టం--2026ను జూలై 1 నుంచి రాష్ట్రంలో అమల్లోకి తెచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉపాధి హామీ కూలీలకు పని కల్పించే విషయంలో గత్యంతరం లేక నోటిఫికేషన్ జారీకి ఈమేరకు కీలక నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఈ చట్టంలో విధించిన నిబంధనలపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయించింది. పార్లమెంటులోనూ కేంద్రం తీరును నిలదీయాలని తీర్మానించింది. గురువారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గం సమావేశమై వీబీ--జీ రామ్ జీని రాష్ట్రంలో అమలు చేసే అంశంపై విస్తృతంగా చర్చించింది. సమావేశం అనంతరం సమాచార, ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహచర మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి సచివాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. కొత్త చట్టంపై ఇతర రాష్ట్రాలూ న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నాయని తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వస్తున్న టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో భారీ ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్‌నగర్, ఎల్‌బీ నగర్, అల్వాల్ టిమ్స్ ఆస్పత్రులతోపాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టులు మంజూరు చేసింది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా మొత్తం 6,278 పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ బేసిక్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులకు అనుమతించారు. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇక్కడ అందించే వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎల్‌ఓసీలు కూడా ఇవ్వాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఫేజ్--1 పనులకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో 21 కి.మీ. పొడవునా అభివృద్ధి చేసేందుకు రూ.7,345.12 కోట్ల విలువైన పనుల మంజూరుకు ఆమోదం తెలిపింది. హిమాయత్ సాగర్ నుంచి ఈసా... ఉస్మాన్ సాగర్ నుంచి మూసా ప్రవాహాలు ప్రారంభమయ్యే చోటు నుంచి బాపూఘాట్ వరకు ఈ పనులు చేపడతారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ పనులు... నిర్వహణ కోసం నూతనంగా 147 పోస్టుల మంజూరుతోపాటు ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బంది డిప్యూటేషన్‌కు ఆమోదం తెలిపారు. త్వరలో ఫేజ్--1 పనులకు టెండర్లు పిలవనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అందించే అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అందించాలని నిర్ణయించారు. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించే సంకల్పంతోపాటు జవాబుదారీతనం పెంచే ఆలోచనలో భాగంగా రాష్ట్రంలో దాదాపు లక్షన్నర మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి ఈ పథకం వర్తింపజేయనున్నారు. = వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంట గ్రామంలో నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణానికి 50 ఎకరాలను, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కాలపహాడ్ గ్రామంలో 10 ఎకరాలను రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మార్కెట్ ధర ప్రకారం కేటాయించేందుకు ఆమోదం. జవహర్ నవోదయ విద్యాలయాలకు రెండు చోట్ల ప్రభుత్వం స్థలం కేటాయించింది. మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల ప్రభుత్వ భూమిని కేబినెట్ కేటాయించింది. జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన మరికొన్ని సంస్థలకు భూములు కేటాయించారు.

## మహారాష్ట్రలో కుండపోత వర్షాలు

ముంబై: ఆలస్యంగా ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ఇప్పుడు మహారాష్ట్రపై పూర్తిస్థాయిలో ప్రభావం చూపుతున్నాయి. ముంబైతో పాటు థానే, నవీ ముంబై, కల్యాణ్--డోంబివలీ, భివండి, పాల్ఘర్, రాయగడ్, కొంకణ్ ప్రాంతాల్లో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలు సాధారణ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి.ానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ముంబైకి ఐదు రోజుల పాటు ఆరెంజ్ అలర్ట్ , రత్నగిరికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. జూలై 2న పాల్ఘర్, జూలై 3, 4 తేదీల్లో రాయగడ్, జూలై 4న థానే, జూలై 5న సతారా ఘాట్ ప్రాంతాలకు, జూలై 2 నుంచి 4 వరకు పుణే ఘాట్ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ అమల్లో ఉంటుంది. ఈ ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. కొంకణ్ ప్రాంతంలోని చాలా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ తెలిపింది. మరాఠ్వాడాలో చాలా ప్రాంతాల్లో, ఉత్తర మహారాష్ట్రలో కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. దక్షిణ మహారాష్ట్రలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగనున్నట్లు అంచనా వేసింది. ముంబైలోని పలు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. అంధేరి సబ్‌వేలో నాలుగు నుంచి ఐదు అడుగుల మేర నీరు చేరడంతో అధికారులు వాహనాల రాకపోకలను చాల సమయం పాటు పూర్తిగా నిలిపివేశారు. జోగేశ్వరి, గోరేగావ్, మలాడ్, కాందివలి, బోరివలి, కుర్లా, ములుండ్, శాంతాక్రూజ్, బాంద్రా తదితర ప్రాంతాల్లో రహదారులపై భారీగా నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నవీ ముంబైలోని జూయినగర్ సమీపంలో సైన్--పన్వేల్ జాతీయ రహదారిపై భారీగా నీరు చేరడంతో ముంబై వైపు వెళ్లే మార్గంలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మరోవైపు భివండి బైపాస్ వద్ద ముంబై--నాసిక్ జాతీయ రహదారిపై కూడా భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. గంటల తరబడి వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి.

## క్రాంతి కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం

విజయవాడలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని వైసీపీ అధినేత జగన్ గురువారం పరామర్శించారు. క్రాంతి కుమార్ భార్య, పిల్లలు, తండ్రిని ఓదార్చిన జగన్, వారికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా నిలిచి పోరాడుతుందని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్.. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనడానికి క్రాంతి కుమార్ ఆత్మహత్యే నిదర్శనమని అన్నారు. "ఆత్మహత్య చేసుకునే ముందు క్రాంతి కుమార్ స్వయంగా సెల్ఫీ వీడియో తీసి, సీఐ నాగరాజు, ఇతర పోలీసుల వేధింపుల గురించి వివరించారు. అయినా ఇంతవరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదు" అని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎనిమిదేళ్ల క్రితం నమోదైన చిన్న కేసుల కోసం గత మూడు నెలలుగా రోజూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధించడం వల్లే అతను ప్రాణాలు తీసుకున్నాడని ఆరోపించారు.

## తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్

వేదికగా పరిస్థితిని రచ్చరచ్చగా మార్చాయి. ముగ్గురు మంత్రులు గన్‌పార్క్ వద్దకు చేరుకుని మరోసారి విపక్షానికి సవాల్ విసరగా, గన్‌పార్క్ వద్ద చర్చకు సై అన్న విపక్ష నేతలు హరీశ్‌రావు, కేటీఆర్‌లను పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో గన్‌పార్క్ వద్ద మాట్లాడిన మంత్రులు, తెలంగాణ భవన్‌లో మాట్లాడిన బీఆర్ఎస్ నేతలు మరోసారి ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకున్నారు. అవినీతి, అప్పులపై ఉభయ పార్టీల మధ్య గత రెండు రోజులుగా మాటల యుద్ధం నడుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల జరిగిన బహిరంగ సభల్లో పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమని ప్రకటించడంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దానికి సై అంటూనే అప్పులకు సంబంధించిన తప్పుడు లెక్కలపై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమంటూ స్పందించారు. మరోవైపు గురుకులాల్లో విద్యార్థులకు సరఫరా చేసే యూనిఫాం, విద్యా కిట్లలో రూ.2 వేల కోట్ల భారీ అవినీతి జరిగిందని, దీనిపై బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్ఎల్పీ ఉప నాయకుడు హరీశ్‌రావు, మరో నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సవాల్ చేయగా, తాము సిద్ధమేనంటూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ క్రమంలోనే గురువారం మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజహరుద్దీన్ గన్‌పార్కు వద్దకు వచ్చారు. బీఆర్ఎస్ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కేటీఆర్ లేదా హరీశ్‌రావు తమతో చర్చకు రావాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే అసెంబ్లీలో ప్రత్యేకంగా దీనిపై చర్చకు సిద్ధం కావాలని సవాల్ చేశారు.

## వాళ్ల డ్రామా చూస్తుంటే బిగ్ బాస్ షో చూస్తున్నట్టుంది

ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న వ్యవహారం 'బిగ్ బాస్' షోను తలపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. పైకి పోరాటంలా కనిపిస్తున్నా, లోపల ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. ఈ రెండు పార్టీల అవినీతి, రాష్ట్ర అప్పులు, పాలనా వైఫల్యాలపై బహిరంగ చర్చ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు సూచించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తెలంగాణకు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ప్రజలకు వివరిద్దామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు 'డబుల్ ఎలిమినేషన్' తప్పదని, రాష్ట్రంలో 'డబుల్ ఇంజిన్' సర్కార్ రావడం ఖాయమని బండి సంజయ్ జోస్యం చెప్పారు.

# నేను చదివిన ఆర్థికశాస్త్రం కంటే సమాజమే ఎక్కువ నేర్పింది

వర్క్‌షాప్‌లో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జీఎస్‌డీపీ, సీఏజీఆర్ వంటి ఆర్థిక సూచికలను విశ్లేషిస్తూనే, వాటి ఫలాలు ప్రజల జీవన ప్రమాణాలను ఎలా మెరుగుపరుస్తున్నాయో చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇటీవలే గూడూరులో తాను పెన్షన్ పంపిణీ చేసిన తులశమ్మ, పద్మమ్మ కుటుంబాల స్థితిగతులను ఉదాహరణగా చూపుతూ, ప్రభుత్వ పథకాలు వారి జీవితాల్లో తెచ్చిన మార్పును సవివరంగా తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డ్వాక్రా రుణాల ద్వారా ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎలా నిలదొక్కుకుంటున్నాయో వివరించారు. దేశంలోనే తొలిసారిగా విజన్-2020 రూపొందించినప్పుడు ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నామని, కానీ భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి పనిచేశామని గుర్తు చేశారు. ఐటీ విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చి, సేవల రంగంలో అపార అవకాశాలు సృష్టిస్తుందని అప్పుడే విశ్వసించి, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి వివరించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కూడా దేశానికి ఒక విజన్ డాక్యుమెంట్ అవసరమని బలంగా నమ్మారని చెప్పారు. ప్రస్తుత యుగంలో డేటానే అసలైన సంపద అని, భవిష్యత్ మొత్తం డేటా ఆధారిత నిర్ణయాలపైనే నడుస్తుందని ఆయన పేర్కొన్నారు.

**టెక్నాలజీతో పారదర్శక పాలన**

ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందించడంతో పాటు, రాష్ట్రంలో సంపద సృష్టించేందుకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం కూడా అంతే కీలకమని చంద్రబాబు అన్నారు. అందుకే స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రభుత్వ శాఖలన్నింటి సమాచారాన్ని ఒకే వేదికపైకి తెచ్చేందుకు 'డేటా లేక్' రూపొందిస్తున్నామని, ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు హెల్త్ రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేసే 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేస్తున్నామని తెలిపారు. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు, సమాజం ద్వారా ఎదిగిన వారు తిరిగి సమాజానికి సేవ చేసేలా ప్రోత్సహించేందుకు 'పీ4' (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు.

**అమరావతిలో క్వాంటం కంప్యూటర్**

అనంతరం సభికులతో జరిగిన ముఖాముఖిలో సీఎం మాట్లాడుతూ.. తాను త్వరగా సంతృప్తి చెందే వ్యక్తిని కాదని, సంతృప్తి చెందితే అక్కడితో ఆగిపోతామని అన్నారు. ప్రజల కోసం నిరంతరం కొత్త విధానాలు, సాంకేతికతను అన్వేషిస్తూనే ఉండాలని సూచించారు. "దేశం నాకేమిచ్చిందని కాకుండా, దేశానికి మనమేం చేశామని ఆలోచించాలి" అని యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఒక కీలక ప్రకటన చేస్తూ, త్వరలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని, భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్లను తయారు చేసే సామర్థ్యాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా జరిగిన ప్యానెల్ చర్చను ముఖ్యమంత్రి సభికుల మధ్య కూర్చొని ఆసక్తిగా తిలకించారు. ఈ చర్చలో పాల్గొన్న కేంద్ర స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ శాఖ కార్యదర్శి డాక్టర్ సౌరభ్ గార్గ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్, నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ ఆర్. బాలసుబ్రహ్మణ్యం, ప్రధాని ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్ తదితరులు ఏపీ ప్రభుత్వ విధానాలను ప్రశంసించారు. నియోజకవర్గాల వారీ విజన్ ప్లాన్, పీ4 కార్యక్రమం, గ్రామస్థాయిలో డేటా సేకరణ వంటివి దేశంలోనే వినూత్నమైనవని, వీటిని జాతీయ స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

## అంగనవాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



**ఎలిగేడు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని అంగనవాడీ సెంటర్--1లో గురువారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. అనంతరం ఏఎల్ఎంఎస్సీ కమిటీ సమావేశం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "అంగనవాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి. 3 నుండి 5 సంవత్సరాల పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా అంగనవాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులు గుర్తించాలి" అని సూచించారు. కార్యక్రమంలో అంగనవాడీ టీచర్ జ్యోతి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

## పత్తి విత్తనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కె.వి.ఎన్ రెడ్డి



**వంగూరు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండలం కొండారెడ్డిపల్లి క్లస్టర్--5 వేదికగా రైతులకు పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కె.వి.ఎన్. రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని రైతులకు పత్తి విత్తనాలను అందజేశారు. సింగిల్ విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చిమ్ముల రాజశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచ్, మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, సింగిల్ విండో డైరెక్టర్లు, సంబంధిత అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహిళా వికలాంగుల విద్య, ఉపాధి పై అవగాహన సదస్సు




**హబ్సిగూడ, జూలై 2 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** హబ్సిగూడ కిన్నెర గ్రాండ్ హోటల్‌లో గురువారం ఇన్ లైట్ సంస్థ అధినేత సురేష్ ఆధ్వర్యంలో 10వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళా వికలాంగుల విద్య, ఉద్యోగ ఉపాధి, మౌలిక సదుపాయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెర్ప్ డైరెక్టర్ కృష్ణమూర్తి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జవాబు సీఈఓ నల్గొండ శ్రీనివాస్, ఫెడ్ నాగభూషణం, తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్, రాంచందర్, విఆర్పి బాబు, రాంబాబు నాగమణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికలాంగుల విద్య, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలపై సమగ్ర చర్చలు జరగగా, సమాజంలో వారికి మరింత స్థానం కల్పించేందుకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వక్తలు ప్రస్తావించారు.

## బీసీ జేఏసీ ఆధ్వర్యంలో కళాశాలల బంద్ విజయవంతం



**కల్వకుర్తి, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం, బీసీ జేఏసీ పిలుపుమేరకు కల్వకుర్తి పట్టణంలోని ఇంటర్, డిగ్రీ కళాశాలలను గురువారం విజయవంతంగా బంద్ చేశారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ, "ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి. జీవో నెంబర్ 7ని వెనక్కి తీసుకోవాలి. స్కాలర్షిప్‌లు ఆలస్యం కావడం వల్ల పేద విద్యార్థులు చదువు మధ్యలో ఆగిపోతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలలను తగ్గించడం సరైనది కాదని, వెంటనే మెగా ఊుజ నిర్వహించి గురుకుల పాఠశాలలో వసతులు కల్పించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి అధ్యక్షుడు మేకల రాజేందర్, నాయకులు భాను చందర్, సురేష్ మోడీ, దారమోని గణేష్, శివ, సామ్రాట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి – సీఐ సత్యనారాయణ



**యాచారం, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని, డ్రగ్స్ వలన కలిగే నష్టాలను గుర్తించి వాటికి దూరంగా ఉండాలని హైద్రాబాద్ గ్రీన్ ఫార్మా పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ పిలుపునిచ్చారు. యాచారం మండలం కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణ, సైబర్ భద్రత, స్మార్ట్‌ఫోన్ సద్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ, "డ్రగ్స్ వాడకం విద్యార్థుల ఆరోగ్యం, చదువు, కుటుంబం, భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటి జోలికి వెళ్లవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి" అని సూచించారు. స్మార్ట్‌ఫోన్‌ను వినోదం కోసం అధికంగా వినియోగించకుండా, విద్యాపరమైన అవసరాలకే ఉపయోగించాలని, సోషల్ మీడియా వేదికల్లో అపరిచితులతో స్నేహాలు చేయడం వల్ల మోసాలు, సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని, సమాజానికి ఆదర్శప్రాయమైన పౌరులుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచిస్తూ ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగియాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తు పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు రాణి, వీరమణి, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత వేగం పెంచాలి

**బీఎల్ఓలకు ప్రజలంతా సహకరించాలి**

**ఇబ్రహీంపట్నం డివిజన్ ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం, జూలై 2 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని తట్టి అన్నారం ఆర్కేనగర్ గ్రామంలో ఎస్ఐఆర్ కింద జరుగుతున్న జగనణన ఫారం పంపిణి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనగణన ప్రక్రియ పురోగతిని అంచనా వేసి పనులు వేగం పెంచాలని సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశాడు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయి ప్రయాత్నాలను మరింత ముమ్మరం చేయాలన్నారు. బీఎల్వోలకు ప్రజలంతా సహకరించాలని కోరారు. అనంతరం తట్టి అన్నారం తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే పునాది అని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ఓటరు జాబితా కచ్చితత్వం కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. బీఎల్ఓలు చేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఫారాలను సకాలంలో పూర్తిచేసి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోవర్దన్, బీఎల్ఓలు, పాల్గొన్నారు.

## కల్వకుర్తి బహిరంగ సభకు బయలుదేరిన వెల్దండ కాంగ్రెస్ నాయకులు



**వెల్దండ, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో గురువారం మహనీయుల జ్ఞాన చైతన్య బస్సు యాత్ర ముగింపు సందర్భంగా కల్వకుర్తి బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున బయలుదేరారు. ఈ కార్యక్రమం స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు భూపతిరెడ్డి మాట్లాడుతూ, "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతోంది. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు యెన్నం భూపతి రెడ్డి, గుండాల సర్పంచ్ శిరీష వెంకట్ యాదవ్, టౌన్ ప్రెసిడెంట్ బాదేపల్లి మల్లయ్య, ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, నాయకులు ఎండి రషీద్, మదన్ గౌడ్, రంగనాథం, కొండయ్య, పురుషోత్తమాచారి, మట్ట నిరంజన్, యూత్ ప్రెసిడెంట్ మట్ట భరత్ గౌడ్, గోరేటి భరత్, కూన కృష్ణయ్య, అన్నెపు ప్రశాంత్, ఈదులపల్లి శ్రీనివాస్, సికిందర్, కొమరయ్య, వలి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ గ్రహీత సదానందం గౌడ్ సన్మానంకు ఎమ్మెల్యే సత్కారం



**కల్వకుర్తి, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సామాజిక విద్యావేత్త అయిల్ సదానందం గౌడ్కు యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీచే చెన్నైలోని భారతీయ విద్యా భవన్‌లో డాక్టరేట్ లభించిన సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గురువారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "నీతి, నిజాయితీ, అంకితభావంతో సదానందం గౌడ్ చేసిన కృషికి డాక్టరేట్ పురస్కారం రావడం మన తెలంగాణ ప్రాంతానికి గర్వకారణం. సాధారణ రైతు కుటుంబంలో జన్మించి ప్రభుత్వ హస్టల్లో చదువుకొని ఉస్మానియా యూనివర్సిటీలో ఏంఏ, ఏంఫిల్, బిఎడ్, సెట్ ఫస్టు క్లాసులో పట్టా పొందడం ఆయన పట్టుదల, కృషికి నిదర్శనం" అని అన్నారు. విద్యా రంగంలో 26 ఏళ్లుగా లెక్చరర్‌గా చేసిన సేవలు, పర్యావరణ పరిరక్షణకై చేసిన కృషి, సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ గౌరవ డాక్టరేట్ అవార్డు లభించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. "భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానంలోకి ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిజేఏసి రాష్ట్ర నేత కత్రావత్ శ్రీనివాస్, కేశమోని లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విబిజి రాంజీ పథకాన్ని రద్దు చేయాలని సిపిఎం డిమాండ్



**కల్వకుర్తి, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి కేంద్ర బిజెపి ప్రభుత్వం విబిజి రాంజీ బిల్లును తీసుకురావడాన్ని నిరసిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన జరిగింది. సిపిఎం నాయకుడు ఏపీ మల్లయ్య మాట్లాడుతూ, "గ్రామీణ కూలీలకు ఉపాధి హామీ పథకం జీవనాధారం. కానీ కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లుతో పథకానికి నిధులు నిలిపివేసి కుట్ర చేస్తోంది. విబిజి రాంజీ బిల్లును రద్దు చేసి పాత విధానంలోనే ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాల్రెడ్డి, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు, ప్రజానాట్యమండలి కళాకారులు జగన్, వెంకటేష్, రజక సంఘం నాయకుడు కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంతయ్య, తిరుపతయ్య, లింగం, సామాజిక ఉద్యమ నాయకుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కూడా నూతన ఈహెచ్ఎస్ వర్తింపజేయాలి



**నల్లగొండ, జూలై 2(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులకు కూడా నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ వర్తింపజేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూల్స్‌లో సుమారు 3,000 మంది ఉద్యోగులు సేవలందిస్తున్నప్పటికీ, ప్రభుత్వ ఉద్యోగులకు అందే ఆరోగ్య భద్రతా పథకాల ప్రయోజనాలు వీరికి అందడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీఎంటీఏ- టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీష్, పీఆర్టీయు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పేరి వెంకట్ రెడ్డి తదితరులు కూడా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు నూతన ఈహెచ్ఎస్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## నూతన కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులకు సన్మానం



**నల్లగొండ, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ నియోజకవర్గంలో నూతనంగా నియమితులైన మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గంగుల సైదులు, కనగల్ మండల అధ్యక్షుడు గడ్డం అనుప్ రెడ్డి, తిప్పర్తి మండల అధ్యక్షుడు పాదూరి శ్రీనివాస్ రెడ్డిలకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. సన్మాన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రష్ అలీ అమేర్, మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, మాజీ వైస్ చైర్మన్ అబ్బుకొని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, ఆర్టిఏ డైరెక్టర్ కూసుకుంట్ల రాజిరెడ్డి, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మాడుగులలో సైబర్ నేరాలపై అవగాహన



**మాడుగుల, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడుగుల మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆనంద్, సీనియర్ ఉపాధ్యాయుడు లక్ష్మయ్య, అధ్యాపక బృందం, మాడుగుల పోలీస్ స్టేషన్ ఎస్ఐ హెచ్. రాఘవేందర్ పాల్గొన్నారు. విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించారు. అదేవిధంగా, పెరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటిపిలు, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. "సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలి" అని తెలిపారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ వేణుగోపాల్ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, మాదక ద్రవ్యాలు, చెడు అలవాట్లు, సైబర్ నేరాలకు దూరంగా ఉండి బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.


## జూలై 4 నుంచి మెగా ఉచిత కంటి వైద్య శిబిరం



**ఆమనగల్లు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండలం, పరిసర గ్రామాల ప్రజలకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో తలకొండపల్లి పట్టణంలోని శ్రీ దేవకి ఫంక్షన్ హాల్‌లో జూలై 4 నుంచి 12 వరకు ఈ శిబిరం నిర్వహించనున్నారు. శిబిరంలో ప్రముఖ శంకర నేత్రాలయ, చెన్నైకు చెందిన నిపుణులైన నేత్ర వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, చికిత్స అందించనున్నారు. కంటి శుక్లాలు (మోతియాబిందు) ఉన్న వారికి పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయించుకోవాలని ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## అర్హులందరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

- 159వ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మార్వో జయశ్రీ



**ఆమనగల్లు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు వివరాల్లో ఉన్న పొరపాట్లను సరిచేసుకోవాలని కడ్తాల్ మండల ఎమ్మార్వో జయశ్రీ సూచించారు. గురువారం కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని 159వ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆమె, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బీఎల్ఓ శైలజ, బీఎల్ఏ క్యామ రాజేష్ సమన్వయంతో కొత్త ఓటర్ల నమోదు, పేరు, చిరునామా మార్పులు, వివరాల సవరణలు, తొలగింపులు తదితర ప్రక్రియలు సక్రమంగా నిర్వహిస్తున్న తీరును ఆమె అభినందించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని సూచించారు. అలాగే ఓటర్లకు అవసరమైన పూర్తి అవగాహన కల్పిస్తూ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ వనిత, జీపీవో ప్రవీణ్, ఆర్ఐ లత, మల్లమ్మ, స్వరూప, ప్రవీణ్ గౌడ్, గంజి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు శ్రీనివాస్ రెడ్డి నియామకంతో కాంగ్రెస్‌కు మరింత బలం

- టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా గూడూరు శ్రీనివాస్ రెడ్డిని నియమించడం పార్టీ బలోపేతానికి దోహదపడే నిర్ణయమని టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నూతనంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గూడూరు శ్రీనివాస్ రెడ్డిని బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా అంకితభావంతో పనిచేస్తున్న గూడూరు శ్రీనివాస్ రెడ్డికి పార్టీ అధిష్ఠానం తగిన గుర్తింపు ఇచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ సమర్థవంతంగా పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. గూడూరు శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో జిల్లా కాంగ్రెస్ మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యట నర్సింహా ముదిరాజ్, కడ్తాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్య నాయక్, మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్పతి నాయక్, కల్వకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, రాజు నాయక్, శేఖర్ నాయక్, సూర్య నాయక్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని గూడూరు శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# మానయ్యకు శుభాకాంక్షలు తెలిపిన పత్యానాయక్



**ఆమనగల్లు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా వస్పుల మానయ్య నియామకం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకువచ్చే నిర్ణయమని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్ అన్నారు. గురువారం నూతనంగా జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన వస్పుల మానయ్యను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పత్యానాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా నిబద్ధతతో పనిచేస్తున్న వస్పుల మానయ్యకు పార్టీ అధిష్ఠానం సముచిత గుర్తింపు ఇచ్చిందన్నారు. పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సమన్వయానికి ఆయన చేసిన సేవలను గుర్తించే ఈ నిర్ణయం జిల్లా కాంగ్రెస్‌కు మరింత బలాన్ని చేకూరుస్తుందని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శిగా మానయ్య పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువయ్యేలా పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ ఆశయాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వస్పుల మానయ్య మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తల సహకారంతో పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, సర్పంచ్ మండ్లి రాములు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, ఆదివాసి రాష్ట్ర నాయకుడు కృష్ణ నాయక్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఖాదర్ ఖాద్రి, కాలే మల్లయ్య, వెంకట్ రెడ్డి, విజయ్ నాయక్, శ్రీధర్ నాయక్, ఫరీద్, శేఖర్ గౌడ్, కరీం, దేవరశెట్టి మహేష్, శ్రీను నాయక్, మహేష్, రాఘవేందర్, రవి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వస్పుల మానయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

## నాలుగు దశాబ్దాలుగా సేవల స్ఫూర్తిగా ఆమనగల్ లయన్స్ క్లబ్

- 41వ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా.. సేవా కార్యక్రమాలకు ప్రశంసలు




**ఆమనగల్లు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాలుగు దశాబ్దాలుగా సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ జిల్లాలోని లయన్స్ క్లబ్‌లకు ఆదర్శంగా నిలిచిందని ఇమీడియట్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ జి. మహేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆమనగల్లులోని కళ్యాణి గార్డెన్స్‌లో నిర్వహించిన 41వ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని గ్రామాలకు సేవలను విస్తరించి, సమాజంలోని ప్రతి వర్గానికి అండగా నిలుస్తున్న ఘనత ఆమనగల్ లయన్స్ క్లబ్‌కే దక్కిందని కొనియాడారు. జిల్లా--320ఏలో నిర్వహించిన మొత్తం సేవా కార్యక్రమాల్లో 10 శాతం సేవలను ఈ క్లబ్ ఒక్కటే నిర్వహించిందని, లబ్ధిదారుల్లో 14 శాతం మంది ఈ క్లబ్ ద్వారానే ప్రయోజనం పొందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ జి. చెన్న కిషన్ రెడ్డి నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించగా, పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ లయన్ సందడి నరేందర్ రెడ్డి 2026--27 నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిగా ఎంగలి బాలకృష్ణ, కార్యదర్శిగా గంగుల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా గంప శ్రీనివాస్ గుప్తా బాధ్యతలు స్వీకరించారు. గత అధ్యక్షుడు కే. గోవర్ధన్ రెడ్డి సభ్యులను సన్మానించగా, క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్ ఏడాది సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నిరుపేద డయాలసిస్ రోగి రాములుకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేయగా, ఎన్నం హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరికాంత్ రెడ్డి ఏడాది పాటు ఉచిత డయాలసిస్ చికిత్స అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో లయన్ డాక్టర్ వి. దామోదర్ రెడ్డి, లయన్ జూలూరు రమేష్ బాబు, కండె సత్యనారాయణ,డాక్టర్ ఏ. ప్రశాంత్ రెడ్డి, బి.ఆర్. రామ్ రెడ్డి, ఎం.ఏ. పాషా, వీరబొమ్మ భిక్షపతి, శ్యాంసుందర్‌తో పాటు పలువురు లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చెస్ పోటీలు



**ఆమనగల్లు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంబేద్కర్ యువజన సంఘం, బుద్ధ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో మండల స్థాయి చెస్ పోటీలు ఈ నెల 4వ తేదీ శనివారం పట్టణంలోని మానస గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు యువజన సంఘం అధ్యక్షుడు లందం చిన్న జంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, యువతలో మేధో వికాసం, ఏకాగ్రత, విశ్లేషణాత్మక ఆలోచనా విధానం పెంపొందించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. చెస్ ఆట ద్వారా ఆత్మవిశ్వాసం, నిర్ణయాత్మక సామర్థ్యం, పోటీతత్వం పెరుగుతాయని, మండలంలోని విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంఘసేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము, ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఫహీం ఖాద్రి, ఎంపీడీవో జైరామ్ విజయ్, ఎంఈఓ పాండు, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పోటీల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## 'చలో కల్వకుర్తి'కి ఘన శ్రీకారం

- ప్రజాపాలన ప్రగతి నివేదిక బస్సు యాత్ర ముగింపు సభకు ర్యాలీ ప్రారంభం



**ఆమనగల్లు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాపాలన ప్రగతి నివేదిక బస్సు యాత్ర ముగింపు సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న విజయోత్సవ భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లేందుకు గురువారం 'చలో కల్వకుర్తి' కార్యక్రమానికి ఘనంగా శ్రీకారం చుట్టారు. ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రగతి నివేదిక బస్సు యాత్ర కీలక పాత్ర పోషించిందన్నారు. యాత్ర ముగింపు సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవ భారీ బహిరంగ సభకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'చలో కల్వకుర్తి' నినాదాలతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ మండ్లి రాములు, జిల్లా కార్యదర్శి మానయ్య, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఖాదర్ ఖాద్రి, కాలే మల్లయ్య, వెంకట్ రెడ్డి, విజయ్ నాయక్, శ్రీధర్ నాయక్, ఫరీద్, శేఖర్ గౌడ్, కరీం, దేవరశెట్టి మహేష్, శ్రీను నాయక్, మహేష్, రాఘవేందర్, రవి తదితరులు ఉన్నారు.

## ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని మూర్తుజపల్లి గ్రామానికి చెందిన సిద్ధిగాని సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము పరామర్శించి మానవత్వాన్ని చాటుకున్నారు. కౌన్సిలర్ కాలే యాదమ్మతో కలిసి మృతుడి నివాసానికి వెళ్లిన ఆయన, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సమాజంలో ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన వెంట రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొని మృతుడికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 3-7-2026

# ఆత్మకూరు టీడీపీ ఎస్ఐఆర్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**నందికొట్కూరు (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆత్మకూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) వర్క్‌షాప్‌లో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి, పాములపాడు మండలాల బీఎల్ఏలతో సమావేశమై ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియపై క్షుణ్ణంగా వివరించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అనుసరించాల్సిన కీలక అంశాలపై చర్చ జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కూటమి ప్రభుత్వ రెండేళ్లలో చేసిన అభివృద్ధి, నెరవేర్చిన హామీలు, రాబోయే మూడేళ్లలో చేపట్టబోయే కార్యక్రమాలను వివరించాలి" అని సూచించారు. అలాగే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయానికి వ్యూహాలు సిద్ధం చేసి, వైసీపీ విషప్రచారాన్ని ధీటుగా తిప్పికొట్టాలని, గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాములపాడు, కొత్తపల్లి మండలాల బీఎల్ఏలు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధితుల ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని ఎస్పీ ఆదేశాలు



**కల్వకుర్తి, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ గురువారం కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై సత్వరమే స్పందించి పారదర్శక విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. బాధితులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించి, వారి ఫిర్యాదులను స్వీకరించి న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. డయల్ 112 ద్వారా వచ్చే కాల్స్‌పై తక్షణ స్పందనతో బాధితులకు సకాలంలో సహాయం అందించాలని బ్లూ కోర్టు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక రౌడీషీటర్ల వివరాలను అడిగి తెలుసుకుని, వారి కదలికలపై నిరంతర నిఘా ఉండాలని సూచించారు. గ్రామస్థాయిలో విధులు నిర్వహించే విలేజ్ పోలీస్ ఆఫీసర్లు ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆయన అన్నారు. స్టేషన్‌లోని రిసెప్షన్, సైబర్ క్రైమ్ వారియర్, సీసీటీవీ ఇన్‌చార్జి మరియు ఇతర సిబ్బంది పనితీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులపై ఆరా తీసి, ఎలాంటి కేసులు పెండింగ్లో ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కురుమూర్తికి ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ నిర్వహణ, రికార్డుల భద్రత, సిబ్బంది క్రమశిక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఎస్పీ, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. "ప్రజల భద్రత, శాంతిభద్రత పరిరక్షణలో జిల్లా పోలీస్ వ్యవస్థ మరింత బలోపేతంగా ముందుకు సాగాలి" అని ఆకాంక్షించారు. ఈ తనిఖీలో కల్వకుర్తి డిఎస్పీ సయిరెడ్డి వెంకట్రెడ్డి, సిఐ భీమ్ కుమార్, ఎస్ఐ కురుమూర్తి, రెండో ఎస్ఐ రాజశేఖర్తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన



**ఖానాపూర్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ పట్టణంలోని తిమ్మాపూర్, శాంతినగర్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితులు చక్రపాణి నరసింహమూర్తి, రాజశేఖర్ శర్మ, ఆలయ అర్చకుడు నిమ్మగడ్డ నాగరాజు ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. అదిలాబాద్ యోగానంద సరస్వతి మహారాజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితిష్ రాథోడ్, మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్, మాజీ చైర్మన్ అంకం రాజేందర్, బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గత మూడు రోజులుగా బోనాలు, కుంకుమార్చన, నిత్య అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# పారదర్శక పాలనకే జనసేన ఆవిర్భావం

**నందికొట్కూరు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం బలహీన వర్గాల అభ్యున్నతి, పారదర్శక పాలన, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా జనసేన పార్టీ ఆవిర్భవించిందని మచిలీపట్నం ఎంపీ, నంద్యాల పార్లమెంట్ జనసేన పార్టీ పరిశీలకుడు వల్లభనేని బాలశౌరి తెలిపారు. గురువారం నందికొట్కూరు పట్టణంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం 15 వేల కోట్ల నిధులు కేటాయించింది. ఉపాధి హామీ పథకంలో రోజులు 100 నుండి 125కి పెంచి, కూలీ వేతనం 400కి పెంచారు" అని వివరించారు. అలాగే, వైసీపీ విషప్రచారాన్ని ప్రజలు తిరస్కరిస్తారని, రాబోయే ఎన్నికల్లో వైసీపీకి పుట్టగతులు ఉండవని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు చింత సురేష్ బాబు, నియోజకవర్గ సమన్వయ బాధ్యులు నల్లమల రవికుమార్, రాష్ట్ర డైరెక్టర్ శాలివాహన సుబ్బయ్య, నాయకులు మధు, నవీన్ రెడ్డి, రామిరెడ్డి, గంగాధర్ యాదవ్, మాసం భాష, ఉస్మాన్ భాష, లక్ష్మీ నారాయణ, మాధవరం రాజు, జలీల్, సయ్యద్, షబ్బీర్, మౌలాలి, దినకర్, కిషోర్, ప్రవీణ్, మొలక శేషు, వెంకటేష్, కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# విబిజి రాంజీతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి





**పాణ్యం, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో విబిజి రాంజీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. పాణ్యం మండల మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, "పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విబిజి రాంజీని ప్రారంభించాయి. 2.50 లక్షల మంది ఉపాధి శ్రామికులు రోడ్లు, గట్లు, వాగులు, చెక్‌డ్యాములు నిర్మించడం ద్వారా నంద్యాల జిల్లా అభివృద్ధికి తోడ్పడుతున్నారు. 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచి, కూలీలకు సమయానికి వేతనాలు చెల్లిస్తున్నారు" అని వివరించారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ, "జాతీయ ఉపాధి హామీ పథకాన్ని విబిజి రాంజీగా మార్చి పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తున్నారు. గ్రామ సభల తీర్మానాల మేరకు పనులు చేపడుతున్నారు. ఇకపై కూలీలకు రోజుకు ?312 వేతనం అందుతుంది" అని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యేలు మార్కెట్ యార్డ్ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, గ్రౌండ్ వాటర్ డిడి రఘురాం, డ్వామా పిడి సూర్యనారాయణ, విబిజి రాంజీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాటను నెరవేర్చిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**నందికొట్కూరు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా నందికొట్కూరు పట్టణంలోని బి.ఆర్. నగర్లో ఎమ్మెల్యే గిత్త జయసూర్య ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. డోర్ టు డోర్ పర్యటనలో కరెంటు సరఫరా లేని ఇళ్ల ముందు విద్యుత్ పోల్స్, వీధి దీపాలు ఏర్పాటు చేస్తానని కాలనీ ప్రజలకు, వార్డ్ ఇన్‌చార్జి బ్రహ్మయ్యకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, ఆ వాగ్దానాన్ని నెరవేర్చారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు, స్థానిక టిడిపి నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. "కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత బి.ఆర్. నగర్ అంచలంచలుగా అభివృద్ధి చెందుతోంది. ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండే ఇన్‌చార్జి బ్రహ్మయ్య కృషి ప్రశంసనీయం" అని నాయకులు



పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా మండల అధ్యక్షురాలు మీనాక్షి దేవి, పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. వలి భాష, జనసేన నాయకులు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

**నందికొట్కూరు (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ?7,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. నందికొట్కూరు మండల కార్యాలయంలో గురువారం "చలో కలెక్టరేట్" వాల్ పోస్టర్‌ను విడుదల చేసిన మండల కార్యదర్శి హరివర్ధన్ మాట్లాడుతూ, "గత మూడు నాలుగు ఏళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడం వల్ల డిగ్రీ విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక చదువుకు దూరమవుతున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాటలకే పరిమితం అవుతున్నారు, కానీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారు" అని విమర్శించారు. అలాగే, విద్యార్థులకు నష్టం కలిగించే ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, హాస్టల్ విద్యార్థులకు నెలకు ?3,000 మిస్ ఛార్జీలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 6వ తేదీన



నంద్యాల కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. "విద్యా రంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు, తల్లిదండ్రులు అందరూ సహకరించి ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సునీల్, నరసింహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో దత్తాత్రేయ స్వామికి విశేషపూజలు



**శ్రీశైలం, జూలై 2(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లోకకల్యాణం కోసం శ్రీశైలం దేవస్థానంలో గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. ప్రతి గురువారం సర్కారీ సేవగా ఈ కైంకర్యం జరుగుతోంది. ముందుగా మహాగణపతిపూజ జరిపి, అనంతరం పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపముగా అవతరించిన త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయుని ఆరాధనకు భక్తులు విశేషంగా హాజరయ్యారు. శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల సంబంధం ఎంతో ప్రత్యేకమని పురాణాలు చెబుతున్నాయి. త్రిఫలవృక్షం క్రింద ఆయన తపస్సు చేసినట్లు ప్రతీతి. కలియుగంలో గోదావరి తీరం పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా, అనంతరం మహారాష్ట్రలో నృసింహ సరస్వతిగా అవతరించి శ్రీశైలంలో చాతుర్మాస్య వ్రతం ఆచరించినట్లు గురుచరిత్ర పేర్కొంటుంది. నృసింహ సరస్వతి స్వామి శ్రీశైలంలోని పాతాళగంగలో అవతార సమాప్తి చేసి, అదృశ్య రూపంలో భక్తులను రక్షించేందుకు నిర్ణయించుకున్నారని గ్రంథాలు చెబుతున్నాయి. కదళీవనం వద్ద శిష్యుల సమక్షంలో అరటి ఆకుల ఆసనంపై కూర్చొని కృష్ణానదిలో ప్రవేశించి అదృశ్యమైనట్లు గురుచరిత్రలో వివరించబడింది.

# ప్రజాస్వామ్యం బలోపేతానికి ఓటు కీలకం



**నందికొట్కూరు, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లి మండల కేంద్రంలో గురువారం జరిగిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అవగాహన సమావేశంలో నందికొట్కూరు వైఎస్ఆర్సిపి ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బూత్ లెవెల్ ఏజెంట్లతో ఓటరు జాబితాల ప్రక్షాళన, అర్హులైన ఓటర్ల నమోదు, నకిలీ ఓటర్ల తొలగింపు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత వంటి అంశాలపై సమీక్షించారు. "అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలి. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి. ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటరు పాత్ర కీలకం" అని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య రాజకీయ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ గా తాటికొండ సీతయ్య

**తుంగతుర్తి, జూలై 2 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆర్యవైశ్య రాజకీయ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా తుంగతుర్తి మండల పరిధిలోని బండరామారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఆర్య వైశ్యులందరికి సీతయ్య కృతజ్ఞతలు తెలిపారు.



## ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు



**ఖానాపూర్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ నుండి దిలావర్‌పూర్, తర్లపాడ్ గ్రామాలకు నూతన రోడ్డు విస్తరణ, రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం నిర్వహించారు.నాయకులు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రహదారి పనులకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించడం అభినందనీయమని పేర్కొన్నారు. రోడ్లు పూర్తయితే విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగిల్ శంకర్, కౌన్సిలర్లు నిమ్మల రమేష్, చిన్నం సత్యం, గౌరె గంగాధర్, తోట సత్యం, కావలి సంతోష్, రాజేశ్వర్, నయీమ్, అమరుల్లా ఖాన్, మధు గౌడ్, డి. రాజేశ్వర్, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సలేంద్ర కొమురయ్య యాదవ్ అరెస్టు



**పెద్దపల్లి, జూలై 2(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్ ఉప్పల్ బగాయత్ ప్రాంతంలో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల భూమి పంపిణీ కోసం పెద్దపల్లి జిల్లా నుండి బయలుదేరిన టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సలేంద్ర కొమురయ్య యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని, అక్రమ అరెస్టులు తమను ఆపలేవని పేర్కొన్నారు. గతంలో ఉద్యమకారులు రాష్ట్ర సాధనలో చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ, ఇప్పటికీ వారికి భూమి, పెన్షన్, సంక్షేమ పథకాలు అందించలేదని ప్రభుత్వంపై విమర్శలు చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉద్యమకారులకు హామీ ఇచ్చిన భూమి, పెన్షన్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల హక్కులు సాధించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవనంద్ లక్ష్మయ్య, హనుమాన్లు, బొంకూరి సుభాష్, కలవల రవీందర్, గంధం శంకరయ్య, అంబాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వానకాలం పంటలకై డిండి ప్రాజెక్టు నుండి సాగునీరు విడుదల



**అమరాబాద్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునుంతల మండలంలో వానకాలం పంటల సాగు కోసం డిండి ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా సాగునీటిని ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డా. చిక్కుడు వంశీకృష్ణ విడుదల చేశారు.లాత్తిపూర్ గ్రామం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, 1941లో ప్రారంభమైన డిండి ప్రాజెక్టు 1943లో సాగులోకి వచ్చిందని, కాలువల మరమ్మతులకు రూ.35 లక్షలు మంజూరు చేసి పనులు పూర్తి చేయించామని తెలిపారు. రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని, ఇది రైతు ప్రభుత్వమని పేర్కొన్నారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసి ప్రతి గ్రామానికి సాగు, తాగునీరు అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో పత్తి విత్తనాల పంపిణీ



**జమ్మికుంట, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జమ్మికుంట రైతు వేదికలో పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం అధిక సాంద్రత పత్తి సాగు (హై డెన్సిటీ కాటన్ కల్టివేషన్) విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు పెంచి అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు వివరించారు.ఈ సందర్భంగా ఆసక్తి కనబరిచిన రైతులకు ప్రత్యేకంగా విత్తనాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉందని, నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్, ఏఈఓలు అశోక్, మార్కెట్ కమిటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


## మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే..

# ప్రజల తీర్పు స్పష్టం

**కేసీఆర్ పాలన రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది.. ఉమ్మడి పాలమూరులో 14 స్థానాలూ కాంగ్రెస్‌వే**

**కల్వకుర్తిలో ప్రజాపాలన ప్రగతి నివేదిక-మహనీయుల జ్ఞానచైతన్య బస్సు యాత్ర ముగింపు సభ**





**కల్వకుర్తి, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రెండున్నరేళ్ల ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగంగా నిర్వహించిన 'మహనీయుల జ్ఞానచైతన్య బస్సు యాత్ర' ముగింపు సందర్భంగా గురువారం కల్వకుర్తిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- సభలో మాట్లాడిన మల్లు రవి.. గత బీఆర్ఎస్ పాలనలో కుటుంబ రాజకీయాలు, అవినీతి పరాకాష్టకు చేరాయని విమర్శించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రాన్ని భారీ అప్పుల భారంలోకి నెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని ఆరోపించారు. క్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల్లోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ఇందిరమ్మ రాజ్యం లక్ష్యంగా ప్రతి వర్గానికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని, మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు.

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రాంతానికి చెందిన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండటం ప్రజల అదృష్టమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.1,000 కోట్ల విలువైన పనులు చేపట్టామని, గ్రామీణాభివృద్ధి నుంచి మౌలిక వసతుల వరకు అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ సంక్షేమ ఫలాలను నేరుగా ప్రజల గడపకు చేరవేస్తోందన్నారు.

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పాలమూరు అభివృద్ధిని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి జిల్లాకు భారీ స్థాయిలో నిధులు కేటాయించి అభివృద్ధికి కొత్త దిశ చూపుతున్నారని అన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని వ్యాఖ్యానించారు.
- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, మహనీయుల జ్ఞానచైతన్య బస్సు యాత్ర ప్రజల్లో విశేష చైతన్యం తీసుకొచ్చిందన్నారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు.
- తెలంగాణ స్టేట్ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్‌పర్సన్ గద్వాల కే. సరిత మాట్లాడుతూ, మహిళల సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంచే సంక్షేమ పథకాలు సమర్థంగా అమలవుతున్నాయని తెలిపారు.
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, ఎంపీ మల్లు రవి ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని కొనియాడారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, ప్రజాపాలన బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలపడిందన్నారు.
- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గత పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం అవినీతికి పాల్పడిందని విమర్శించారు.
- ఈ కార్యక్రమంలో రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చెల్లా నరసింహారెడ్డి, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాగూర్ బాలాజీ సింగ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ కుమార్ యాదవ్, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ నేతల తీవ్ర విమర్శలు



**పెద్దపల్లి, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తోందని, దాన్ని ఇంటికి పంపే సమయం ఆసన్నమైందని బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అరుణ్ రంజా అన్నారు. జిల్లా కార్యాలయంలో ఆయనను, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రఫీని, కార్యదర్శి శివంగారి సతీష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ పాలనపై యువత విశ్వాసం పెరుగుతోందని, అందుకే దేశవ్యాప్తంగా బీజేపీ విజయాలు సాధిస్తోందని తెలిపారు.రాష్ట్రంలో బొగ్గు కుంభకోణంపై మొదటగా స్పందించినది కేంద్రమంత్రి కిషన్ రెడ్డేనని, బీఆర్ఎస్--కాంగ్రెస్ పార్టీలు తెలంగాణను వెనక్కి తీసుకెళ్లాయని విమర్శించారు. ఎస్ఐఆర్‌పై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ, 2029లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.ఈ సమావేశంలో సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, గాదరి సతీష్ పాల్గొన్నారు.

## స్థానిక ఓటర్లతో బూత్ స్థాయి సమావేశం



**కరీంనగర్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మారుతీనగర్ పోలింగ్ స్టేషన్ నంబర్ 218లో ప్రత్యేక సమగ్ర సవరణ చేయాలని -2026 కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారి (బి.ఎల్.ఓ) ఎ. రేవతి స్థానిక ఓటర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్, బి.ఎల్.ఏ మరియు బి.ఎల్.ఏ-2ల బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఇంటింటి గణనలో భాగంగా పంపిణీ చేస్తున్న ప్రి-ఫిల్డ్ ఫారాలను ఆన్‌లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చని తెలిపారు.గైర్హాజరైన, వేరే ప్రాంతానికి మారిన, మరణించిన మరియు ద్వంద్వ నమోదులు ఉన్న ఓటర్ల వివరాలను బి.ఎల్.ఓ దృష్టికి తీసుకురావాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఏ-2 కొంపెల్లి సాగర్, రజిత, వనజ, రాయమల్లమ్మా, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కళాశాలల బంద్ విజయవంతం

### ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్




**అమరాబాద్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్ నిర్వహించారు. అచ్చంపేటలో జరిగిన బంద్ విజయవంతమైంది.జిల్లా అధ్యక్షుడు డ్యాగ అనిల్ కుమార్ మాట్లాడుతూ, బలహీన వర్గాల విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, గత విద్యా సంవత్సరాలకు సంబంధించిన దాదాపు 8,000 కోట్ల రూపాయల బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.బకాయిలు చెల్లించకపోవడంతో అనేక కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నాయని, దీని వల్ల విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వెంకటేష్ ప్రజాపతి, గుద్దటి ఆంజనేయులు, రాజు యాదవ్, సాయి కుమార్, ప్రశాంత్, మమత, గాయత్రి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామంలో నీటి సమస్య పరిష్కారం



**ఖానాపూర్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని సింగపూర్ గోండు గూడ గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్‌కు గిరిజన ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో బోరు వేయించి మోటార్ అమర్చినందుకు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యను తీర్చిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు






**కరీంనగర్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రూరల్ సీఐ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహించిన సమయంలో గోపాల్పూర్--బొమ్మకల్ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా గొల్లపల్లి వాగు నుండి ఇసుకను తరలిస్తున్నట్లు యజమానులు, డ్రైవర్లు అంగీకరించడంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. యజమానులు పండగ అనిల్, గౌతం పరశురాములు, డ్రైవర్లు కుర్ర రాజు, గట్టు రాజులపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేశారు. నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

# తెలంగాణ గడ్డపై ఏపీ పోలీసుల దౌర్జన్యం



అమరాబాద్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ సభ్యుడు జర్నలిస్ట్ కె.వి.ఆర్ నివాసంలోకి ఏపీ పోలీసులు అక్రమంగా చొరబడిన ఘటనను తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. టీజేఏసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ, యూనిఫాం లేకుండా, మహిళా పోలీసులు లేకుండా ఇంట్లోకి ప్రవేశించడం చట్టవిరుద్ధమని, ఇది మానవ హక్కుల ఉల్లంఘన అని పేర్కొన్నారు. జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేయడం, అర్ధరాత్రి అరెస్టులు జరపడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఏపీ పోలీసులు వ్యవహరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. జర్నలిస్ట్ కె.వి.ఆర్‌ను వెంటనే విడుదల చేయాలని, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని టీజేఏసీ డిమాండ్ చేసింది.

# సింగరేణి అధికారులకు పీఆర్పీ ఇవ్వడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం




**మంథని, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కమాన్‌పూర్ సింగరేణి ఆర్జీ--3 ప్రాంతంలో సీఎంఓ అధికారుల రిలే నిరాహార దీక్ష నాలుగో రోజు కొనసాగుతోంది. ఈ శిబిరాన్ని సందర్శించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చల్ల నారాయణరెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో పనిచేస్తున్న అధికారులకు రావాల్సిన పీఆర్పీని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంచడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఉద్యోగుల సంక్షేమం గురించి గొప్పలు చెప్పి, ఇప్పుడు వారి న్యాయమైన హక్కుల విషయంలో మౌనం వహించడం సిగ్గుచేటని అన్నారు. సింగరేణి లాభాల్లో వాటాలు తీసుకోవడంలో ముందుండే ప్రభుత్వాలు, అధికారులకు రావాల్సిన పీఆర్పీ చెల్లించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం దుర్మార్గమని మండిపడ్డారు. వెంటనే అధికారులతో చర్చలు జరిపి పీఆర్పీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అధికారులకు న్యాయం జరిగేలా బీజేపీ తరపున పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, సింగరేణి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓవర్ సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**కరీంనగర్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 2026--27 విద్యా సంవత్సరానికి గాను అంబేద్కర్ ఓవర్ సీస్ విద్యా నిధి పథకానికి ఎస్సీ విద్యార్థుల నుండి దరఖాస్తులను తెలంగాణ ప్రభుత్వం స్వీకరిస్తోంది. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ హైదరాబాద్ ద్వారా జూలై 1 నుండి ఆగస్టు 31 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. కరీంనగర్ జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఈ పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాల కోసం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుల కార్యాలయాన్ని సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# శాతవాహన యూజీ ఫలితాలు విడుదల




**కరీంనగర్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2026లో నిర్వహించిన యూజీ (ఆర్19) ఆరో, నాలుగో, రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను అధికారులు విడుదల చేశారు. ఆరో సెమిస్టర్ పరీక్షలకు బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల నుండి 9,361 మంది విద్యార్థులు హాజరుకాగా, 4,721 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 50 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీరిలో 2,135 మంది డిస్టింక్షన్, 2,580 మంది ఫస్ట్ క్లాస్, 6 మంది సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారు. కోర్సుల వారీగా బీబీఏ 65 శాతం ఉత్తీర్ణతతో ముందంజలో నిలిచింది. బీఏ, బీకాం 51 శాతం, బీఎస్సీ 48 శాతం ఉత్తీర్ణత సాధించాయి. నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 7,902 మంది విద్యార్థులు హాజరుకాగా, 3,536 మంది ఉత్తీర్ణత సాధించారు. మరో 4,352 మంది విద్యార్థులు తదుపరి సెమిస్టర్‌కు ప్రమోట్ అయ్యారు. కేవలం 14 మంది మాత్రమే నాట్-ప్రమోటెడ్‌గా నిలిచారు. ఈ సెమిస్టర్‌లో మొత్తం 45 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బీబీఏ 58 శాతం, బీఏ 53 శాతం, బీకాం 45 శాతం, బీఎస్సీ 42 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఫలితాల అనంతరం రీవాల్యుయేషన్, రీకౌంటింగ్ కోసం విద్యార్థులు తమ సంబంధిత కాలేజీల ద్వారా ఆన్‌లైన్‌లో జూలై 12లోపు దరఖాస్తు చేసుకోవాలి. జవాబు పత్రాల జెరాక్స్ కాపీల కోసం జూలై 15 వరకు అవకాశం ఉంది. విద్యార్థులు ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ లో చూసుకోవచ్చునని పరీక్షల నియంత్రణాధికారి డి. సురేష్ కుమార్ తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు వెంటనే అందించాలి




**కరీంనగర్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడిచినా ఇప్పటికీ విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు, ఎంఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి లేకపోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర, ఇస్కాన్ వంటి సంస్థలకు అప్పగించడం వల్ల నాణ్యతలేని భోజనం అందుతోందని, మళ్లీ మహిళా సంఘాల ద్వారా నిర్వహించాలని సూచించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పెరుగుతున్నప్పటికీ ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి కార్యాలయాలను ముట్టడిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి భోగేశ్వర్, గట్టు ఆకాష్, కమిటీ సభ్యులు రత్నం సురేష్, సన్నీ, రక్షక్, నాయకులు సాయి, ఉదయ్, మనోజ్, శ్రీశాంత్, అభినవ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో హౌస్ ఎలక్షన్స్

**కరీంనగర్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని తలపించే విధంగా హౌస్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి మూలమని, ఓటు హక్కు విలువను విద్యార్థులు బాల్యదశ నుండే తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులను సరస్, తేజస్, లక్ష్య, ధ్రువ హౌస్‌లుగా విభజించి ఎన్నికలు నిర్వహించారు. పోటీదారులు తమ గుర్తులను ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థించగా, విద్యార్థులు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించారు. ఫలితాలను త్వరలో ప్రకటించి ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించనున్నట్లు పాఠశాల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# కాళేశ్వరం వైఫల్యాలపై హరీశ్ రావు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నేతల డిమాండ్



**కరీంనగర్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలు రెండేళ్లు కూడా గడవక ముందే కుంగిపోవడానికి కారణం ఏమిటో మాజీ మంత్రి హరీశ్ రావు సమాధానం చెప్పాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు డిమాండ్ చేశారు. కరీంనగర్ ఆర్ ఓ బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, అబద్ధాల ప్రచారమే వారి పని అని విమర్శించారు. కేసీఆర్, హరీశ్ రావు ఇంజనీర్ల అవతారమెత్తి కట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు రెండేళ్లకే కుంగిపోయాయని, దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం మరమ్మతు పనులు ప్రారంభించిందని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినదేమీ లేదని, కాంగ్రెస్ హయాంలో ఎస్ఆర్ఎస్పి ప్రాజెక్ట్ ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందిందని గుర్తు చేశారు. కాళేశ్వరం పేరుతో కట్టిన లిఫ్టుల ద్వారా కనీసం 50 వేల ఎకరాలకు కూడా నీళ్లు అందలేదని ఆరోపించారు. రైతుల సమస్యలపై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను సేకరించిందని తెలిపారు. రూ. 21 వేల కోట్లు కేటాయించి 25 లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ చేసిన ఘనత తమదేనని, త్వరలోనే రూ. 9,000 కోట్ల రైతు భరోసా నిధులు జమ కానున్నాయని ప్రకటించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న వడ్లకు బోనస్ వంటి పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుంటే, బీఆర్ఎస్ నేతలు అధికారం కోల్పోయిన నిరాశతో అబద్ధాల ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఆకుల నరసయ్య, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నకిలీ లేబుళ్లతో నిల్వ మాంసం విక్రయం

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 2: అత్తాపూర్ పరిధిలోని ప్రముఖ రెస్టారెంట్ బార్బె క్యూ నేషన్‌లో ఆహార భద్రతా అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అక్కడ లభించిన నిల్వ ఉంచిన నాణ్యత లేని మాంసం, అపరిశుభ్ర వాతావరణాన్ని గమనించిన అధికారులు రెస్టారెంట్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి, భారీ జరిమానా విధించారు. అత్తాపూర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సౌమ్య మీడియాతో మాట్లాడుతూ బార్బెక్యూ నేషన్‌లో ఆహారం తిన్న ఇద్దరు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురై ఫుడ్ పాయిజనింగ్ అయినట్లు హెచ్-ఫాస్ట్ బృందానికి ఫిర్యాదు అందిందన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు, హెచ్-ఫాస్ట్ బృందంతో కలిసి రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో భాగంగా కిచెన్, మాంసం నిల్వ ఉంచే కోల్డ్ స్టోరేజీ గదులను పరిశీలించగా షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. యాజమాన్యం చికెన్, మటన్ వంటి మాంసాన్ని దాదాపు 4-5 రోజుల పాటు నిల్వ ఉంచుతున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా ప్రతి రోజూ పాత మాంసంపై ఉన్న లేబుళ్లను మారుస్తూ కొత్త లేబుళ్లను అంటిస్తూ కస్టమర్లను మోసం చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఎక్కువ రోజులు మాంసాన్ని నిల్వ ఉంచడం వల్లే అది కలుషితమై ఫుడ్ పాయిజనింగ్‌కు దారి తీసిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాల తయారీ, నిల్వ ఉంచడం వంటి సెక్షన్ల కింద రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. చట్టపరమైన చర్యలతో పాటు జరిమానా విధిస్తున్నట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సౌమ్యతెలిపారు.



# జాతీయ రహదారిపై టిప్పర్ బోల్తా



**సుల్తానాబాద్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై వెళ్తున్న టిప్పర్ లారీ తెల్లవారుజామున బోల్తా పడింది. జైపూర్ ఎన్టిపిసి నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న ఈ లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. టిప్పర్ బోల్తా పడిన సమయంలో రోడ్డుపై ఇతర వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో డ్రైవర్ ముఖేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

# సుల్తానాబాద్--జమ్మికుంట బస్సు సేవలపై ప్రయాణికుల అసంతృప్తి



**సుల్తానాబాద్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ నుండి జమ్మికుంట వెళ్లే ఆర్టీసీ బస్సు తీవ్ర రద్దీతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మెయిన్ సెంటర్‌లో ఆపకుండానే వెళ్లిపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ రద్దీ పెరుగుతుండటంతో కాలేజ్, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు కిక్కిరిసిన పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. ఉదయం 9:30 గంటలకు జమ్మికుంట నుండి సుల్తానాబాద్‌కు వచ్చే బస్సు కనగర్తి గ్రామం మీదుగా ప్రయాణిస్తుండగా, ప్రధాన స్టాప్‌లలో ఆగకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ మార్గంలో అదనపు బస్సులు నడిపి, అన్ని ప్రధాన స్టాప్‌లలో బస్సు నిలిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలని కౌశిక్ రెడ్డి డిమాండ్




**హుజురాబాద్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, రూ. 1,13,000 కోట్ల బకాయిలను చెల్లించాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. మూడు విడతల రైతు బంధు బకాయిలు రూ. 30,000 కోట్లు, కౌలు రైతులకు రూ. 22,500 కోట్లు, రుణమాఫీ రూ. 29,500 కోట్లు, రైతు కూలీలకు రూ. 15,000 కోట్లు, పంటలకు బోనస్ రూ. 16,000 కోట్లు బాకీగా ఉన్నాయని లెక్కలతో వివరించారు. మొత్తం రూ. 1,13,000 కోట్ల మేర రైతులకు రావాల్సిన బకాయిలను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని, ఆ తర్వాతే విజయోత్సవాలు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. హామీలు అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను రైతాంగం గమనిస్తోందని, రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఏఐ ఆధారిత తీర్పుల రద్దు!.. నిపుణుల కమిటీ ఏర్పాటుకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యాయ నిర్ణయ ప్రక్రియలో ఏఐ ప్రభావంపై పరిశీలన

న్యూఢిల్లీ, జూలై 2: న్యాయనిర్ణయ ప్రక్రియలో కృత్రిమే మేధ (ఏఐ) ప్రభావాన్ని పరిశీలించేందుకు ఓ నిపుణుల కమిటీని ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్‌ను ఆదేశించింది. పలు ట్రిబ్యునళ్లు ఏఐ సృష్టించిన కల్పితమైన తీర్పులపై ఆధారపడ్డాయని కనుగొన్న తరువాత సర్వోన్నత న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. కృత్రిమ మేధపై ఆధారపడి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్టీ), నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) జారీచేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దుచేసింది. ఈ రెండు ట్రిబ్యునళ్లు ఓ దివాలా కేసుకు సంబంధించి నిర్ణయం తీసుకొనేటప్పుడు ఏఐ సృష్టించిన 'కల్పితమైన' తీర్పులపై ఆధారపడ్డాయని వ్యాఖ్యానించింది. న్యాయనిర్ణయ ప్రక్రియ, న్యాయవాదుల వృత్తిలో ఏఐ వినియోగం ద్వారా ఎదురవుతున్న సవాళ్లను పరిశీలించేందుకు ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేతో కూడిన ధర్మాసనం బార్ కౌన్సిల్‌కు సూచించింది. న్యాయమూర్తులు, న్యాయవాదులకు కృత్రిమ మేధ సహకారిగా ఉన్నప్పటికీ అది మానవ తార్కిక శక్తికి ప్రత్యామ్నాయం కాబోదని బెంచ్ వ్యాఖ్యానించింది. న్యాయ నిర్ణయ ప్రక్రియ ప్రతి దశలో, పూర్తిగా, మానవ నియంత్రణలోనే ఉండాలని నొక్కిచెప్పింది. ఈ కేసులో ట్రిబ్యునల్.. కృత్రిమ మేధ ద్వారా సృష్టించిన, ఉనికిలో లేని, బోగస్, కల్పిత అంశాలపై ఆధారపడి నిర్ణయం తీసుకున్నదని తెలిపింది. అందువల్లనే న్యాయప్రక్రియ సమగ్రతను కాపాడేందుకు





ఎన్‌సీఎల్‌టీ, ఎన్‌సీఎల్ఏటీ ఇచ్చిన తీర్పులను రద్దు చేస్తున్నామని స్పష్టంచేసింది. కేవలం ఓ తప్పుడు తీర్పును సరిదిద్దడానికే పరిమితం కాకుండా ఏఐ పట్ల న్యాయవ్యవస్థ వైఖరిని నిర్వచించడానికి ఈ కేసు ఒక అవకాశాన్ని కల్పిస్తున్నదని న్యాయమూర్తులు పేర్కొన్నారు. అంతకుముందు విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది మాధవీ దివాన్ తన వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో ట్రిబ్యునళ్లు ఆరు తీర్పులపై ఆధారపడ్డాయని, కానీ నిజానికి అవి ఎక్కడా ఉనికిలో లేకపోగా.. న్యాయపరమైన అంశాలకు అవి ఏమాత్రం ఉపయోగపడనివి అని తెలిపారు. ఆ ఆరు తీర్పులను తాము గుర్తింపు పొందిన ఏ డాటాబేస్‌లోనూ కనుగొనలేకపోయామని వెల్లడించారు. దీంతో అవి కల్పితమైనవి లేదా ఏఐ ద్వారా సృష్టించబడిన కల్పిత ఉల్లేఖనలు అని తెలుస్తున్నదని వివరించారు.

# స్పీడ్ పోస్ట్‌తో గంజాయి సరఫరా

**అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు**

పోస్టల్, కొరియర్ సేవల ద్వారా దేశవ్యాప్తంగా గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ రట్టు చేసింది. జార్ఖాండ్ కేంద్రంగా ఈ అక్రమ రవాణా సాగిస్తున్న నెట్‌వర్క్ సూత్రధారి సత్యం మిశ్రాను అరెస్ట్ చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు వివరాలను సీపీ సజ్జనార్ మీడియా సమావేశం ద్వారా వెల్లడించారు. జార్ఖాండ్ రాష్ట్రానికి చెందిన సత్యం మిశ్రా గతంలో లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. 2018లో గంజాయికి బానిసై సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో శుభమ్ మిశ్రా, సచిన్ మిశ్రా, రాహుల్ ఝా, సంతోష్ పండిట్‌తో కలిసి ఒక ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారంలోకి దిగారు. తన స్వగ్రామంలోనే గంజాయిని పండించి ముంబయి, చెన్నై, కేరళ, రాజస్థాన్, ఢిల్లీ, బెంగళూరు సహా 12 రాష్ట్రాల్లో కస్టమర్లను ఏర్పరచుకుని విక్రయాలు సాగిస్తున్నారు. ఈ ముఠా ఇలా రోజుకు సగటున 80 నుంచి 10 ఆర్డర్లు పూర్తిచేస్తూ ఏడాదికి రూ. 2 కోట్లపైగా సంపాదిస్తున్నారు. పోలీసుల కళ్లు కప్పేందుకు పార్సిళ్లను మ్యాంగో, స్టిక్, ఫ్లవర్ వంటి కోడ్ పదాలను వాడుతూ వివిధ పరిమాణాల్లో విక్రయించేవారు. ఈ నేపథ్యంలో




ఇస్రీ బజార్ పోస్ట్ ఆఫీస్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఒకరికి ఈ ముఠా గంజాయి పార్సిల్ పంపింది. సమాచారం అందుకున్న హెచ్‌న్యూ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో సైప్లై లింక్ బయటపడిందని సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సుశాంత్ వ్యాస్, లడ్డు అనే వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ గైక్వాడ్ వైభవ్, ఇన్‌స్పెక్టర్లు బాలస్వామి, నాగార్జున, ఎస్సై మనోజ్ కుమార్, ఏఎస్సైలు హెడ్‌కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# నకిలీ వీసాలతో మస్కట్‌కు.. 20 మంది మహిళల అరెస్ట్

శంషాబాద్ రూరల్, జూలై 2: నకిలీ వీసాలతో మస్కట్‌కు వెళ్లేందుకు యత్నించిన



20 మంది మహిళలను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజామున 20 మంది మహిళలు ఒమన్ ఎయిర్‌లైన్స్ విమానంలో మస్కట్ వెళ్లేందుకు ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఇమిగ్రేషన్ అధికారులు వారి వద్ద ఉన్న వీసాలను పరిశీలించగా, అవి నకిలీవని గుర్తించారు. వారిని ఆదుపులోకి తీసుకొని శంషాబాద్ ఎయిర్‌పోర్టు అవుట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు. నకిలీ వీసాలు ఎవరు ఇచ్చారని ప్రశ్నిస్తే ఏజెంట్ ద్వారా తీసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. నకిలీ వీసాలు ఇచ్చిన ఏజెంటు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్ట్




**కరీంనగర్, జూలై 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రూరల్ మండలంలో మైనర్ బాలికపై ప్రేమ పేరుతో మోసం చేసి లైంగిక దోపిడీ చేసిన ఆటో డ్రైవర్ గనుకుండ్ల మురళీకృష్ణను పోలీసులు అరెస్టు చేశారు. బాలిక ఫిర్యాదు మేరకు, నిందితుడు గత రెండు సంవత్సరాలుగా పాఠశాల, కళాశాలకు ఆటోలో తీసుకెళ్తూ పరిచయం పెంచుకొని వివాహం చేసుకుంటానని నమ్మించి పలుమార్లు తన ఇంటికి తీసుకెళ్లి దోపిడీ చేశాడని తెలిపింది. తరువాత అతనికి ఇప్పటికే వివాహమై ఒక కుమార్తె ఉన్నట్లు తెలిసి దూరంగా ఉండగా, ఇటీవల బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు పేర్కొంది. రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ పర్యవేక్షణలో సీఐ నిరంజన్ రెడ్డి సిబ్బందితో గాలింపు చేపట్టి, బొమ్మకల్ శివారులో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించడంతో మోటార్‌సైకిల్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని, పంచుల సమక్షంలో ఒప్పుకోలు నమోదు చేశారు. అనంతరం అతనిని న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తూ, పిల్లలను ఆటోల్లో పంపే ముందు డ్రైవర్ వివరాలు తెలుసుకోవాలని, వారి ప్రవర్తనపై నిఘా ఉంచాలని సూచించారు. విద్యార్థుల పట్ల అసభ్యంగా లేదా చట్టవిరుద్ధంగా ప్రవర్తించిన డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# SBI యోనో యాప్‌లో కొత్తగా ఏఐ ఫీచర్లు

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ 71వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రిటైల్, బిజినెస్ కస్టమర్ల కోసం పలు ఏఐ ఆధారిత డిజిటల్ ఆవిష్కరణలను ప్రవేశపెట్టింది. యోనో ప్లాట్‌ఫాంలో సేవలను మరింతగా విస్తరించింది. కొత్త కస్టమర్లు ఇప్పుడు 3--ఇన్--1 డిజిటల్ ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ ద్వారా పొదుపు ఖాతాతో పాటు ఎస్‌బీఐక్యాప్ సెక్యూరిటీస్‌లో డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతా కూడా తెరవచ్చు. అర్హత కలిగిన కస్టమర్లు తమ సేవింగ్స్ అకౌంటును కార్పొరేట్ శాలరీ అకౌంటుగా మార్చుకోవచ్చు. అలాగే వ్యాపార వర్గాల కోసం ట్రేడ్ ఫైనాన్స్ సాధనాలన్నింటిని యోనో బిజినెస్‌లో అనుసంధించడం ద్వారా ఈ--ట్రేడ్ సేవలను విస్తరించినట్లు బ్యాంకు తెలిపింది. యోనో బిజినెస్ వెబ్, మొబైల్ ప్లాట్‌ఫాంలలో ఇరవై నాలుగ్గంటలూ అందుబాటులో ఉండేలా ఏజెంటిక్ ఏఐ ఆధారిత వర్చువల్ అసిస్టెంట్ 'యోనో జీ'ని బ్యాంకు ప్రవేశపెట్టింది. కృత్రిమ మేథ, డిజిటల్ ఆవిష్కరణలు, డేటా ఆధారిత విశ్లేషణలతో కస్టమర్లకు మరింత మెరుగైన సేవలందించాలన్న తమ లక్ష్యానికి ఇవి నిదర్శనమని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఎస్‌బీఐకి 53 కోట్ల పైగా కస్టమర్లు ఉండగా, వారిలో 10 కోట్ల మంది యోనో యూజర్లు ఉన్నారు.




# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయా..?



ఇరాన్-అమెరికా యుద్ధం ముగియడం, పశ్చిమాసియాలో శాంతి నెలకొనడం వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశంలో కూడా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయేమోనని వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. ఈ అంశంపై కేంద్ర పెట్రోలియం, చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పందించారు. ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే అవకాశం లేదన్నారు. అయితే, కొన్ని వారాలపాటు అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు స్థిరంగా, తక్కువగా ఉంటే అప్పుడు ప్రభుత్వం ధరల్ని తగ్గిస్తుందని చెప్పారు. ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటినుంచి జూన్ 30 వరకు చమురు కంపెనీలు రూ.74,781 నష్టపోయాయన్నారు. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ అమ్మకాల ద్వారా ఈ మేరకు కంపెనీలు నష్టపోయాయన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ కంపెనీలు ఇంకా నష్టాల్లోనే నడుస్తున్నాయన్నారు. కారణం చమురు కంపెనీలు ఇంకా గతంలో కొనుగోలు చేసిన క్రూడాయిల్‌నే ప్రాసెస్ చేస్తున్నాయన్నారు. కంపెనీలు దాదాపు రెండు నెలల ముందు చమురును కొంటాయని, ప్రస్తుతం శుద్ధి చేస్తున్న చమురును రెండు నెలల క్రితం ఎక్కువ ధరకు కొనుగోలు చేశాయని పూరి తెలిపారు. అందువల్లే ఇప్పుడు ధరలు తగ్గే అవకాశం లేదన్నారు. అయితే, ఈ అంశంపై బుధవారం సమీక్ష జరిపినట్లు తెలిపారు. చమురు సరఫరా కోసం కొన్ని ప్రత్యేక ప్రాజెక్టులు చేపడుతున్నామని, రాబోయే ఆరు నుంచి పన్నెండు నెలల్లో ఈ ప్రాజెక్టులు పూర్తవుతాయని అన్నారు. క్రూడాయిల్ శుద్ధి సామర్థ్యాన్ని సంవత్సరానికి 300 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం మొదలైనప్పటి నుంచి ఇండియాలో చమురు ధరలు పెరిగాయి. సగటున లీటర్‌కు రూ.7.50 వరకు పెరిగాయి. ఎల్పీజీ, పీఎన్‌జీ ధరలు కూడా పెరిగాయి. ఈ కారణంగా నిత్యావసరాలు, ఆహార పదార్థాల ధరలు కూడా పెరిగాయి. దీంతో ధరల తగ్గుదల కోసం వినియోగదారులు ఎదురుచూస్తున్నారు.

# ఎఫ్‌పీఐల 49 వేల కోట్ల పెట్టుబడులు వెనక్కి




ముంబై, జూలై 2: దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతున్నది. అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు, అభివృద్ధి చెందిన దేశాల్లో పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు నెలకొనడం, అమెరికా బాండ్ రాబడుల్లో పెరుగుదల వంటి కారణాలతో విదేశీ మదుపర్లు జూన్ నెలలో ఏకంగా రూ.49,340 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.2.7 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కితీసుకున్నట్టు అయింది. 2025లో విక్రయించిన రూ.1.66 లక్షల కోట్ల కంటే ఇది రెండింతలు అధికం. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో రూ.22,615 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు..మిగతా నెలల్లో వెనక్కి తీసుకున్నారు. జనవరి నెలలో రూ.35,962 కోట్లు, మార్చిలో రూ.1.17 లక్షల కోట్లు, ఏప్రిల్‌లో రూ.60 వేల కోట్లు మే నెలలో రూ.32,963 కోట్లు, జూన్‌లో రూ.49,340 కోట్ల చొప్పున ఉపసంహరించుకున్నారు.

# భారీగా లాభపడిన స్టాక్ మార్కెట్లు

ముంబై, జూలై 2: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కివచ్చే అవకాశం ఉండటంతోపాటు క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో మదుపర్లను కొనుగోళ్ల వైపు నడిపించాయి. ఫలితంగా ఇంట్రాడేలో 600 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 579.48 పాయింట్లు అందుకొని 77,502.12 వద్ద ముగిసింది. నిఫ్టీ 169.85 పాయింట్లు ఎగబాకి 24,175.70 వద్ద ముగిసింది. గత కొన్ని రోజులుగా తగ్గుముఖం పట్టిన ఐటీ రంగ షేర్లు కదంతొక్కాయి. దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ షేరు 6 శాతం వరకు లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు టెక్ మహీంద్రా 4.32 శాతం లాభపడగా, టీసీఎస్ 4.28 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీ 4.12 శాతం, విప్రో 2.35 శాతం చొప్పున బలపడ్డాయి.



## స్పోర్ట్స్





# మూడో రౌండ్‌కు స్వియాటెక్, జొకో

లండన్: డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో దూసుకెళ్తోంది. ప్రపంచ మాజీ నంబర్ వన్ కరోలినా ప్లిస్కోవాకు చెక్ పెట్టి మూడో రౌండ్‌లో అడుగు పెట్టింది. గురువారం రాత్రి జరిగిన రెండో రౌండ్ పోరులో మూడో సీడ్ పోలాండ్ స్టార్ 6-1, 6-3తో ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)ను వరుస సెట్లలో చిత్తు చేసింది. తొలి రౌండ్‌లో టౌన్‌సెడ్‌పై నెగ్గేందుకు చెమటోడ్చిన స్వియాటెక్ ఈ మ్యాచ్‌లో అద్భుత షాట్లతో విజృంభించింది. తొలి సెట్‌లో వరుసగా నాలుగు గేమ్స్ గెలిచి 4-0తో నిలిచిన తర్వాత వెనుదిరిగి చూడకుండా ప్లిస్కోవా పని పట్టింది. మరో మ్యాచ్‌లో ఆరో సీడ్ అనిసిమోవా (అమెరికా) 6-2, 4-6, 7-6 (10/3)తో తమ దేశానికే చెందిన సోఫియా కెనిన్‌పై పోరాడి గెలిచింది. 12వ సీడ్ మర్టా కోస్త్యుక్ (ఉక్రెయిన్) 6-7 (7/5), 6-3, 6-3తో బ్లింకోవా (రష్యా)ను ఓడించి ముందంజ వేసింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్, రెండో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 6-1, 6-3, 7-6 (7/3)తో వాలెంటైన్ రోయర్ (ఫ్రాన్స్)పై గెలిచి మూడో రౌండ్ చేరాడు. సెర్బియా లెజెండ్, ఏడో సీడ్ నొవాక్ జొకోవిచ్ 6-3, 6-4, 6-2తో వరుస సెట్లలో సిట్సిపాస్ (గ్రీస్)ను చిత్తు చేశాడు. ఇతర మ్యాచ్‌ల్లో ఆరో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 6-2, 6-2, 7-5 కిప్సన్ (అమెరికా)ను, అలెగ్జాండర్ డిమినార్ (ఆస్ట్రేలియా) 6-3, 6-2, 6-2తో మనారినో (ఫ్రాన్స్)ను ఓడించారు. పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్లు శ్రీరామ్ బాలాజీ, అనిరుధ్ చంద్రశేఖర్, యూకీ భాంబీ జోడీల పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది.

# బెల్జియం బచ్‌గయా.. సెనెగల్‌కు నిరాశ





సియాటెల్ (యూఎస్ఏ): అనూహ్య ఫలితాలు వెలువడుతున్న ఫిఫా ప్రపంచకప్‌లో మరో రసవత్తర పోరు సాకర్ అభిమానులను ఫిదా చేసింది. ఆట మరో ఐదు నిమిషాల్లో ముగుస్తుందనేవరకూ గెలుపు రేసులోనే లేని బెల్జియం ఆఖర్లో అద్భుతం చేసింది. 85వ నిమిషం వరకు 0-2తో నిలిచి ఓటమి ఖాయం అనుకున్న దశ నుంచి అసాధారణంగా పుంజుకున్న ఆ జట్టు వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యుత్తమ కమ్‌బ్యాక్‌లలో ఒకటి అనదగ్గ విజయాన్ని నమోదుచేసింది. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి రసవత్తరంగా సాగిన పోరులో బెల్జియం 3-2తో సెనెగల్‌ను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించింది. హబీబ్ దియారా (24వ నిమిషంలో), ఇస్మాయిల్ సార్ (51వ) సెనెగల్ తరఫున గోల్స్ చేయగా రొమెలు లుకాకు (86 వ) ఓ గోల్ కొట్టగా.. యురి టిలెమన్స్ (89వ, 120్5వ) డబుల్ గోల్స్‌తో 'రెడ్ డెవిల్స్' విజయంలో కీలకపాత్ర పోషించాడు. ప్రిక్వార్టర్స్‌లో బెల్జియం, ఈ నెల 6న యూఎస్ఏతో అమీతుమీ తేల్చుకోనుంది.

### సెనెగల్‌దే ఆధిక్యం..

మ్యాచ్‌లో తమకంటే మెరుగైన ర్యాంకింగ్‌లో ఉన్న బెల్జియంను నిలువరించిన సెనెగల్ ప్రత్యర్థిపై పూర్తిస్థాయి ఆధిపత్యం ప్రదర్శించింది. ఆట జరిగిన నిర్ణీత సమయంలో సుమారు 85 నిమిషాల పాటు ప్రత్యర్థికి చుక్కలు చూపించి ఆ జట్టును దాదాపు ఓడించినంత పనిచేసింది. ఆట ఆరంభం నుంచే బెల్జియం డిఫెన్స్‌కు సవాల్ విసురుతూ ఆడిన ఈ ఆఫ్రికా దేశానికి 24వ నిమిషంలోనే తొలి గోల్ లభించింది. సడియొ మనె క్రాస్‌ను అందుకున్న సార్.. హెడర్‌తో బంతిని నెట్‌లోకి నెట్టేందుకు యత్నించినా బంతి స్టాండ్‌కు తగలి పక్కకు వెళ్లగా అక్కడే ఉన్న దియారా మెరుపు వేగంతో గోల్ చేసి సెనెగల్‌ను ఆధిక్యంలోకి తెచ్చాడు. ఫస్టాఫ్ ముగిసిన వెంటనే మౌసా నుంచి వచ్చిన లాంగ్ పాస్‌ను అందుకున్న ఇస్మాయిల్.. బెల్జియం డిఫెన్స్‌ను దాటుకుంటూ గోల్ కొట్టి తన జట్టును 2-0 ఆధిక్యానికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత బెల్జియం పలుమార్లు ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై దాడులకు దిగినా ఆ జట్టు పప్పులుడకలేదు.

### ఆఖర్లో అద్భుతం

ఆట మరో 5 నిమిషాల్లో ముగుస్తుందనేవరకూ బెల్జియం.. 0-2తోనే ఉంది. కానీ ఆఖరివరకూ నమ్మకాన్ని కోల్పోని ఆ జట్టు.. 86వ నిమిషంలో లుకాకు గోల్‌తో పోటీలోకి వచ్చింది. 55వ నిమిషంలో ఫీల్డ్‌లోకి వచ్చిన లుకాకు.. థామస్ ఇచ్చిన పాస్‌ను అందుకుని బాక్స్‌కు అతి సమీపం నుంచి గోల్ చేసి బెల్జియం అభిమానుల్లో జోష్ నింపాడు. ఆ తర్వాత మూడు నిమిషాలకే ట్రాసర్డ్ ఇచ్చిన క్రాస్‌ను అందుకున్న టిలెమన్స్.. తలతో బంతిని నెట్‌లోకి పంపించడంతో స్కోర్లు 2-2తో సమమయ్యాయి. ఇక 30 నిమిషాల అదనపు సమయంతో పాటు ఇంజూరీ టైమ్ ముగిసేవరకూ గోల్ లేకపోవడంతో మరో షూటౌట్ తప్పదా? అనిపించింది. ఈ టైమ్‌లో టిలెమన్స్‌ను బాక్స్ లో సెనెగల్ ఆటగాళ్లు కిందపడేశారు. 'వార్' రివ్యూ.. ప్రత్యర్థి నిరసనల తర్వాత రిఫరీ బెల్జియంకు పెనాల్టీ ఇచ్చాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రశాంతంగా గోల్ కొట్టిన టిలెమన్స్ ఈ టోర్నీకే హైలైట్‌లా నిలిచే విజయంతో తన జట్టును ప్రిక్వార్టర్స్‌కు చేర్చాడు.

### అమెరికా జోరు

సొంత అభిమానుల నడుమ అగ్రరాజ్యం అమెరికా మరోసారి రెచ్చిపోయింది. గురువారం శాన్‌ఫ్రాన్సిస్కో వేదికగా జరిగిన పోరులో యూఎస్ఏ 2-0తో బోస్నియా హెర్జ్‌గొవినియాను ఓడించి టోర్నీలో రౌండ్-16కు దూసుకెళ్లింది. ఫోలారిన్ బాల్‌గున్ (45వ), మాలిక్ టిల్‌మన్ (82 వ) చెరో గోల్స్ చేశారు. ఈ మ్యాచ్ గోల్‌తో ప్రపంచకప్‌లో మూడో గోల్ కొట్టిన ఫోలారిన్‌కు 64వ నిమిషంలో రిఫరీ రెడ్‌కార్డు చూపడం గమనార్హం.



# కుష్బూ వారసురాలిద్దరూ రెడీ..



ఉత్తరాది నుంచి దక్షిణాదికి దిగుమతి అయిన నటి కుష్బూ హిందీలో బాల నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ సంచలన నటి ఆ తరువాత తెలుగులో వెంకటేష్‌కు జంటగా కలియుగ పాండవులు చిత్రంలో కథానాయికిగా పరిచయమయ్యారు. ఆ తరువాత వరుషం-- 16 చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చారు. విశేషం ఏమిటంటే ఈమె తెలుగు, తమిళం భాషల్లో నటించిన రెండు చిత్రాలు విజయం సాధించాయి. ఆ తరువాత ఈ రెండు భాషల్లోనూ పలు చిత్రాల్లో నటించారు. తమిళంలో రజనీకాంత్, కమలహాసన్, విజయకాంత్, ప్రభు, కార్తీక్ వంటి నటులతో జంటగా నటించారు. కథానాయకిగా బిజీగా ఉండగానే దర్శకుడు సుందర్.సిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ తరువాత రాజకీయ రంగప్రవేశం చేసి ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రచార కర్తగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. మరో పక్క నిర్మాతగా చిత్రాలు నిర్మిస్తున్నారు. సుందర్.సి, కుష్బూ దంపతులకు అవంతిక, ఆనందిత అనే ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఇప్పుడు వారు కూడా సినీ రంగప్రవేశం చేయడం విశేషమేమీ కాదు. చిన్న కూతురు ఆనందిత దర్శకుడు మణిరత్నం వద్ద సహాయ దర్శకురాలిగా చేరారు. పొన్నియిన్ సెల్వన్ 1, 2, థగ్‌లైఫ్ చిత్రాలకు పని చేశారు. పెద్ద కూతురు అవంతిక హీరోయిన్‌గా రంగప్రవేశం చేశారు. ఈమె లండన్‌లో నటనలో శిక్షణ పొందారన్నది గమనార్హం. ఇటీవల ఒక వాణిజ్య ప్రకటనలో నటించి తల్లి కుష్బూ ప్రశంసలు అందుకున్నారు. తాజాగా ఆరంభం అనే మలయాళ చిత్రంలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో సరిత మరో ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. సురేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ తాజాగా ప్రారంభమైంది. అవంతిక త్వరలో తమిళ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ అవుతారని ఆశించవచ్చు.

# కాన్సెప్ట్ బాగుంది కానీ... అందులో వాస్తవం లేదు: దర్శకుడు క్రిష్

దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తదుపరి మూవీ అడ్వెంచర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనుందని, అందులో ఏడుగురు హీరోయిన్లు నటించనున్నారనే వార్తలు ఇటీవల సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఈ ప్రచారంపై స్పందించిన క్రిష్.. ఏడుగురు హీరోయిన్లు, ట్రెక్కింగ్ అడ్వెంచర్.. ఐడియా బాగుంది, కానీ ఇది నిజం కాదని అన్నారు. సోషల్ మీడియాలో పుట్టిన మరో స్క్రిప్ట్ మాత్రమేనంటూ వదంతులకు తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టారు. తన కొత్త సినిమా వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తానని చెప్పారు. గమ్యం మూవీతో దర్శకుడిగా పరిచయమైన క్రిష్, ఆ మూవీతో తెలుగు ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని అందించిన సంగతి తెలిసిందే. తరువాత వేదం, కృష్ణం వందే జగద్గురుమ్ వంటి ఆలోచనాత్మక చిత్రాలు, అలాగే కథానాయకుడు (ఎన్టీఆర్) వంటి బయోపిక్‌ను తెరకెక్కించారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన హరి హర వీరమల్లు, ఘాటి మూవీలు గత ఏడాది విడుదలయ్యాయి.





# లొకేషన్‌లో వాగ్వివాదం

షూటింగ్ టైమ్‌లో క్రియేటివ్ డిఫరెన్స్ కామన్. డైరెక్టర్‌కీ డీవోపీకీ మధ్య ఈ విషయంలో గొడవలెక్కువగా వస్తుంటాయి. మూవీ మేకింగ్‌పై నిర్మాతకు అవగాహన ఉంటే కూడా సెట్‌లో వాదనలకు ఆస్కారం ఉంటుంది. ఈ మధ్య సెట్స్‌లో హీరోల జోక్యం కూడా ఎక్కువైందని, కొందరు హీరోలైతే డైరెక్టర్లకీ, డీవోపీలకూ షాట్ ఎలా పెట్టాలో కూడా చెబుతున్నారనీ ఇన్‌సైడ్ టాక్.. ఈ విషయంలో బాలీవుడ్ రెండాకులు ఎక్కువే చదివింది. అక్కడ హీరోయిన్లు కూడా జోక్యం చేసేసుకుంటున్నారట. వివరాల్లోకెళ్తే. యష్‌రాజ్ ఫిల్మ్స్ పతాకంపై లేడీ స్పై థ్రిల్లర్‌గా 'ఆల్ఫా' సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అలియాభట్ లీడ్‌రోల్ చేస్తున్నది. శివ్‌రావెల్ దర్శకుడు. ఈ సినిమా షూటింగ్‌లో అలియాభట్ జోక్యం అధికమవ్వడంతో లొకేషన్‌లో పెద్ద గొడవే జరిగిందట. లొకేషన్‌లో దర్శకుడు శివ్‌రావెల్‌కు క్రియేటివ్ అవుట్‌పుట్స్‌ని అలియా ఎక్కువగా ఇస్తుండటం అసలు గొడవకు కారణమైందని వినికిడి. యాదృశ్చికంగా బాబీడియోల్ కాంబినేషన్ సీన్స్ తీస్తున్నప్పుడు కూడా ఇది జరిగిందట. ఈ విషయంలో కొంతవరకూ బాబీడియోల్ సర్దుకుపోయినా.. వ్యవహారం శృతి మించడంతో అభ్యంతరం తెలియజేయక బాబీడియోల్‌కి తప్పిందికాదు. దాంతో ఇద్దరి మధ్య ఓ స్థాయిలో వాగ్వివాదం జరిగిందట. ఈ గొడవను చల్లార్చి, షూటింగ్‌ను సజావుగా నడిపించేందుకు దర్శక,నిర్మాతలు చాలా కష్టపడాల్సివచ్చిందట. ప్రస్తుతం బాలీవుడ్ మీడియాలో ఈ విషయంపై కథనాలు వెలువడుతున్నాయి. 'అల్ఫా' సినిమా విషయంలో అలియా అధికంగా జోక్యం చేసుకోవడానికి కారణం యష్‌రాజ్ ఫిల్మ్స్ గత చిత్రాలైన వార్ 2, మర్దానీ 3 చిత్రాల ఫలితాలేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.





# సీతతో విడిపోయిన తర్వాత చాలా సంతోషంగా ఉన్నా: పార్తీబన్

సినీ నటి సీత, దర్శకుడు, నటుడు పార్తీబన్ 1990లో ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. దాదాపు 12 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత ఇద్దరూ విడిపోయారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు ఒక కుమారుడిని దత్తత తీసుకున్నారు. విడిపోయినప్పటి నుంచి పార్తీబన్ ఒంటరిగానే ఉంటున్నారు. సీత మాత్రం మరొక వ్యక్తిని పెళ్లాడి, ఆ తర్వాత ఆయనతో కూడా విడిపోయారు. సీతతో తన వివాహం, విడిపోవడంపై పార్తీబన్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... సీతతో విడిపోయినందుకు తాను ఎప్పుడూ బాధపడలేదని చెప్పారు. నిజం చెప్పాలంటే ఆమెతో విడాకులు తీసుకున్న తర్వాత చాలా సంతోషంగా ఉన్నానని తెలిపారు. అయితే, ఆమెతో ఉన్న 12 సంవత్సరాలు తన జీవితంలో మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయిందని చెప్పారు. ఈ రోజుల్లో పురుషులు కానీ, మహిళలు కానీ వివాహం చేసుకోవడం కంటే స్వతంత్రంగా ఉండానికే ఇష్టపడతారని... ఏ మహిళ కూడా వివాహం పేరుతో పరిమితులు ఉండే జీవితాన్ని కోరుకోదని తెలిపారు. పార్తీబన్ చేసిన ఈ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.



# వారణాసి ఏ జానర్ మూవీ?... రాజమౌళి సమాధానం ఇదే!

దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'వారణాసి'పై ఆసక్తి రోజు రోజుకీ పెరుగుతోంది. హీరోగా మహేశ్ బాబు నటిస్తుండగా, ఈ చిత్రం ఏ జానర్‌కు చెందిందన్న దానిపై వివిధ ఊహాగానాలు వినిపించాయి. టైటిల్ గ్లింప్స్ విడుదలైన తర్వాత కథపై మరింత ఆసక్తి పెరిగింది. ఇక ఆటోమేటిక్ వీల్‌చైర్‌లో విలన్ పాత్రలో కనిపించిన పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్‌లుక్ ఆధారంగా ఇది సైన్స్ ఫిక్షన్ సినిమా అంటూ ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారానికి స్వయంగా రాజమౌళి క్లారిటీ ఇచ్చారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. 'వారణాసి'కి సైన్స్ ఫిక్షన్ ఫీల్ ఉన్నా, ఇది ఆ జానర్ సినిమా కాదని స్పష్టం చేశారు. ఇది ఫాంటసీ --మైథలాజికల్ మూవీ అని వెల్లడించారు. ఆర్ఆర్ఆర్ విజయంతో ఎలాంటి ఒత్తిడి లేదని రాజమౌళి తెలిపారు. కొత్త సినిమా ప్రారంభించినప్పుడు గత చిత్రాల ఫలితాలను దృష్టిలో పెట్టుకోనన్నారు. రుద్ర పాత్రలో వృషభంపై మహేశ్ ఎంట్రీ 'వారణాసి'లో గ్రేటెస్ట్ సినిమాటిక్ మూమెంట్ అవుతుందన్నారు. దర్శకుడిగా ప్రేక్షకులకు ఎప్పుడూ కొత్త అనుభూతి ఇవ్వాలనుకుంటానని తెలిపారు. అది కేవలం విజువల్స్ పరంగానే కాదు, భావోద్వేగాల పరంగానూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మూవీ రన్‌టైమ్ మూడు గంటల కంటే తక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నానన్నారు. పూర్తి సినిమాను ఐమ్యాక్స్ వెర్షన్‌లో తెరకెక్కించాలని భావించినప్పటికీ, కొన్ని పరిమితుల కారణంగా కొన్ని సన్నివేశాలనే ఆ ఫార్మాట్‌లో రూపొందిస్తున్నామని తెలిపారు. రామాయణం ఎపిసోడ్ షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, దానికి సంబంధించిన వీఎఫ్ఎక్స్ పనులు సవాలుగా ఉన్నాయని చెప్పారు. ఈ భారీ ప్రాజెక్ట్ 'వారణాసి' 2027 ఏప్రిల్ 7 న ప్రేక్షకుల ముందుకు రానుంది.